www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -54 సోమవారం 8 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# రాష్ట్రాభివృద్ధికి కిషన్‌రెడ్డే అడ్డు

- బీజేపీలో ఉండి ఇంకోపార్టీ సహకారం తీసుకుంటున్నాడు
- గతంలో ఇలాచేస్తేనే ఆయన్ని ప్రజలు ఓడించారు
- రాష్ట్రంపట్ల బాధ్యత లేనట్టే వ్యవహరిస్తున్నారు
- ఈనెల 15 తర్వాత ఆయన సంగతి చెప్తా: ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి
- 'ఎంఎంసీ' పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపనలు



**హైదరాబాద్,(ప్రజావినికిడి): జూన్ 07:** రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మోకాలడ్డుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అహ్మదాబాద్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, యూపీలో గంగానది రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకుంటున్నారనీ, తెలంగాణలో మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని తెలిపారు. హైదరాబాద్ మురికి నల్లగొండ ప్రజలకు కాలుష్యమై కాటేస్తున్నదనీ, ఒక వైపు ఫ్లోరైడ్ సమస్య, రెండో వైపు మూసీ కాలుష్యం, మరోవైపు చచ్చిన శవాల కళేబరాలు నల్లగొండ జిల్లాకు కొట్టుకొస్తుంటే ఆ ప్రాంత ప్రజలు మిగతా2లో...

# నేడు ఇండియా జన్‌బంధన్ భేటీ

- హాజరుకానున్న 23 పార్టీలు
- డిఎంకె, ఆప్ విముఖత




**న్యూఢిల్లీ, (ప్రజావినికిడి):జూన్ 07:**బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి వ్యూహాన్ని చర్చించి, ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేసేందుకు నేడు(సోమవారం) దేశ రాజధాని ఢిల్లీలో ప్రతిపక్షాలు భేటీ కానున్నాయి. సోమవారం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగే 'ఇండియా జన్ బంధన్' సమావేశంలో 23 రాజకీయ పార్టీలు పాల్గొననున్నాయి. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, శివసేన (ఠాక్రే) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తదితరులు హాజరయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.ఈ సమావేశం 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇండియా బ్లాక్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుంది. జాతీయ సమస్యలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించనుంది. ప్రతిపక్ష కూటమి తన వైవిధ్యంతోనే ఐక్యంగా నిలుస్తుందని కాంగ్రెస్ పేర్కొంది. అయితే ఈ సమావేశంలో డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం పాల్గొనేందుకు విముఖత వ్యక్తం మిగతా2లో...

## 15న మోగనున్న బడిగంట

- విద్యాశాఖ ఉత్తర్వులు



2లో

## రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి : కేటీఆర్



**హైదరాబాద్,(ప్రజావినికిడి): జూన్ 07:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో మిగతా2లో...

## దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు

- లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి
- విద్యపై పెట్టే ప్రతి రూపాయి.. భవిష్యత్ తరాల కోసం పెట్టుబడి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



2లో

## రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే గెలుపు: టీపీసీసీ చీఫ్

**హైదరాబాద్,(ప్రజావినికిడి): జూన్ 07:** రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జలమండలి యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ జెండా ఎగరడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. 800 ఓట్ల భారీ మెజారిటీతో అధ్యక్షుడిగా గెలిచిన రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కార్మికులకు ఉన్న నమ్మకానికి నిదర్శనం అని వ్యాఖ్యానించారు. ఇక రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీదే గెలుపు అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# తెలంగాణ హక్కులు ఏపీకి తాకట్టు

- చంద్రబాబు ఆనందం కోసం నీటి వాటాల్లో రేవంత్ రాజీ
- గోదావరి-కావేరి అనుసంధానంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం : మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్,(ప్రజావినికిడి): జూన్ 07:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి మెప్పు కోసం తెలంగాణ నీటి వాటాలను సీఎం రేవంత్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి, కృష్ణా జలాల వాటాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పు పట్టారు. పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీలు, డిండి ప్రాజెక్ట్‌కు 20 టీఎంసీల నీటికి ఏపీ ఎన్‌వోసీ ఇస్తే పోలవరం ప్రాజెక్ట్‌కు అనుకూలమని చెప్పడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని వల్ల అత్యధికంగా పాలమూరు జిల్లాకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "పాలమూరుకు కేటాయించిన 90 టీఎంసీల్లో 45 మైనర్ ఇరిగేషన్, 45 డైవర్షన్ లో వచ్చేవి. పాతవి 811, కొత్తగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగతా2లో...



## "నన్ను ఆపేటోడు తెలంగాణ గడ్డపై పుట్ట లేదు": కిషన్ రెడ్డి

**హైదరాబాద్,(ప్రజావినికిడి): జూన్ 07:** "నన్ను ఆపేటోడు తెలంగాణ గడ్డపై పుట్ట లేదు..నేను మీలాగ పది పార్టీలు మారలేదు.." అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని పొలిమేరలో అడుగు పెట్టనివ్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్జి శనివారం చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ప్రతిస్పందించారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తరహాలో తాను పది పార్టీలు మారలేదని, బిజెపిలో పుట్టానని, చనిపోయేది కూడా బిజెపిలోనేనని అన్నారు. తనను పొలిమేరలో అడుగు పెట్టనీయకుండా అడ్డుకునేటోడు ఈ గడ్డపై ఆపేటోడు పుట్టలేదని ఆయన మిగతా2లో...

# సంగారెడ్డిలో ఫిక్సింగ్ రాజకీయాలు

- మంత్రి దామోదర్, హరీశ్ రావు, జగ్గారెడ్డి, రఘునందన్ రావు మిలాఖత్
- జహీరాబాద్ బుల్లెట్ ట్రైన్‌పై రఘు నందన్‌రావు మౌనం వీడాలి : టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట కవిత



**మెదక్, (ప్రజావినికిడి):జూన్ 07:** సంగారెడ్డిలో ఫిక్సింగ్ రాజకీయాలకు పాల్పడుతున్నారని టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట కవిత ఆరోపించారు. ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించిన జెండా పండుగకు ఆ పార్టీ నాయకులు కులబ్‌గూర్ దయాకర్ రెడ్డి, సంఘమిత్ర, శ్రీనివాస్ రెడ్డితో కలిసి కవిత టీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంగారెడ్డిది ఘనమైన ఉద్యమ చరిత్ర అని, 1930లో జోగిపేట నుంచే భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైందని అన్నారు. అలాంటి చోట జగ్గారెడ్డి, హరీశ్ రావు, దామోదర్, చింతా ప్రభాకర్, రఘునందన్ రావు ఫిక్సింగ్ రాజకీయాలకి పాల్పడుతున్నారని ఆరోపించారు. చూడడానికి వేరువేరు పార్టీల్లో ఉన్నా అందరూ ఒకటే అని 30 ఏండ్లుగా ఇక్కడ రాజ్యమేలుతున్న రాజకీయ పార్టీలు ఏం చేశాయో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ తెచ్చుకున్నదే మిగతా2లో...

# రాష్ట్రాభివృద్ధికి కిషన్‌రెడ్డే అడ్డు

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ప్రక్ష?ళన చేయాలని కోరుతున్నారని తెలిపారు. మూసీ బాధితులకు ఇంటికి ఇల్లు, ఉపాధికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిద్దామంటే కేంద్రమంత్రి ఎందుకు ముందుకురావట్లేదని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు అనుమతులు తేవాల్సిన బాధ్యత ఆయనకు లేదా అడిగారు. ఢిల్లీ తర్వాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రోరైల్ ఇప్పుడు 9వ స్థానానికి పడిపోయిందనీ, దీన్ని 122 కి.మీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపితే దాన్నకి కూడా కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. రీజనల్ రింగ్ రోడ్డు వస్తే 360 కిలో మీటర్లు అభివృద్ధి జరుగుతుందనీ, గడిచిన రెండున్నరేండ్లలో అభివృద్ధి పనుల సహకారం కోసం 50 సార్లు ఢిల్లీకి వెళ్లి, ఐదు సార్లు ప్రధాని మోడీని కలిసినా పనులు ఆగుతున్నాయంటే దానికి కారణం కిషన్‌రేడ్డే కాదా అని ప్రశ్నించారు. మూసీకి నిధులు, మెట్రోకు అనుమతులు, రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించాలన్న బాధ్యత ఈ ప్రాంత బీజేపీ నేతలకు లేదా అని అడిగారు. ఈనెల 15లోపు కేంద్రం 75 లక్ష?ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనకుంటే, అప్పుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంగతి చెప్తామని హెచ్చరించారు. తుమ్మిడి హెట్టికి సైతం ఆయనే అడ్డుపడుతున్నారనీ, మహారాష్ట్ర సీఎంకు పదిసార్లు లేఖలు రాసినా సమాధానం ఎందుకు రావట్లేదో అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీలో ఉంటూనే తెరవెనుక నుంచి మరోపార్టీ సహకారాన్ని ఆయన తీసుకుంటున్నారనీ, గతంలో ఇలా చేస్తేనే ప్రజలు ఆయన్ని ఓడించారని గుర్తుచేశారు. అభివృద్ధి పనులకు అనుమతుల కోసం కేంద్రమంత్రుల దగ్గరికి వస్తానన్నా, కిషన్‌రెడ్డి తీసుకెళ్లట్లేదనీ, కుమ్మక్కు రాజకీయాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కలిసి వస్తే ఎల్బీ స్టేడియంలో ఆయనకు గండపెండేరం తొడుగుతామని చెప్పారు. ఆదివారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఉప్పల్ భగాయత్‌లో రూ.1511 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పదెకరాల్లో రూ.98 కోట్లతో నిర్మించనున్న 'ఎంఎంసీ' భవన నిర్మాణం, రూ.960 కోట్లతో ఏటీసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, రూ.416 కోట్లతో టీకేఆర్ కాలేజీ జంక్ష?న్‌లో 6 లైన్ల ఫ్లై ఓవర్ నిర్మాణం, రూ.37.50 కోట్లతో 100 పడకల మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. పరిపాలనా సౌలభ్యం కోసమే 'క్యూర్'ను ఏర్పాటు చేశామని చెప్పారు. నల్లా కనెక్ష?న్ కావాలన్నా, ఇంటి పర్మిషన్ కావాలన్నా.. ఏదైనా అధికారిని కలవాలంటే ట్యాంక్ బండ్ దగ్గరికి పోవాల్సి ఉండేదనీ, అంతదూరం వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే పాలనను వికేంద్రీకరించామన్నారు. జోనల్ కమిషనర్‌కు ఉండే పరిధే డీసీపీకి కూడా ఉంటుందనీ, అన్ని శాఖల సమన్వయం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తనకు సరైన సహకారం అందకపోవడంతో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని, ముఖ్యంగా ఉప్పల్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానని అంగీకరించారు. గతంలో నగరంలో జీపీలు, జెడ్పీ, మున్సిపాల్టీలు, జీహెచ్ఎంసీ ఇలా నాలుగు రకాల పరిపాలనా విభాగాలు ఉండటంతో సహకారం సరిగ్గా అందక ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తయారుచేయడంతోపాటు రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను తీసుకొచ్చామని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపలనే దాదాపు 2100 స్కోయర్ కిలోమీటర్ల ప్రాంతంలో 1 కోటీ 34 లక్ష?ల జనాభా ఉందనీ తెలిపారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వీరిందరికీ మౌలిక వసతులు కల్పించడానికి, పరిపాలనా సమన్వయం కోసం 'క్యూఆర్'గా నామకరణం చేసి జీహెచ్ఎంసీని 3 మున్సిపల్ కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 నియోజకవర్గాల్లో కంటోన్మెంట్ కారిడార్ ఎలివేటెడ్ నుంచి శామిర్‌పేట మెట్రో విస్తరణ పనులతో సహా అన్ని పనులూ పూర్తి చేస్తామన్నారు. గండిపేట నుంచి గాంధీ సరోవర్ వరకు మూసీ ఫేజ్1 మొదటి విడతగా పని చేస్తున్నామనీ, ఫేజ్ 2లో నాగోల్ నుంచి గౌరెల్లి వరకు 100 రోజుల్లో మూసీ ప్రక్ష?ళన పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

# నేడు ఇండియా జన్‌బంధన్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

చేశాయి. కొన్ని పార్టీలు తమ సొంత కారణాల వల్ల ఈ ప్రత్యేక సమావేశానికి హాజరు కాలేమని తెలిపినట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. 'దేశంలో లక్షలాది మంది భారతీయుల ఓటు హక్కును హరించివేస్తున్నారు. ప్రతి రోజు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయిస్తున్నారు. కోట్లాది మంది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నారు. ఎడతెరిపి లేకుండా పెరుగుతున్న అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ బహిరంగంగానే ఇండియా బ్లాక్‌కి దూరంగా ఉంది. కేరళలో సీపీఐ(ఎం) బీజేపీతో కుమ్మక్కయిందని కాంగ్రెస్ అగ్ర నేతలు చేసిన ఆరోపణలపై సీపీఐ(ఎం) తీవ్ర విమర్శలు చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకి లేఖ కూడా రాశారు. ఆ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటువంటి ఆరోపణలు ప్రతిపక్ష కూటమికి ఆధారమైన సహకార స్ఫూర్తికి విరుద్ధ మని పేర్కొన్నారు. ఆ లేఖను మిగిలిన ఇండియా బ్లాక్ పార్టీల నేతలకు కూడా పంపించారు. అయితే సీపీఐ(ఎం) 'ఇండియా జన్‌బంధన్' సమావేశానికి హాజరు కానుంది. సీపీఐ(ఎం) ప్రతినిధిగా ఆ పార్టీ రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ హాజరుకానున్నారు.

# దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు

**బోనకల్,మన జనప్రగతి జూన్ 07:** రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు కేవలం భవనాలు కావని, అవి రేపటి తరాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దే 'దార్శనిక దేవాలయాలు' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం పరిధిలోని బోనకల్ మండల పరిధిలోని లక్ష్మీపురంలోని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం పరిశీలించారు.

**నాణ్యతతో.. వేగంగా పూర్తి చేయాలి** నాణ్యతతో వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలోని భవన సముదాయాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాలినడకన తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్ విభాగాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వేదికలుగా నిలిచే మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పనులను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

**ఆలోచనే ఒక పెట్టుబడి!** విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి.. కేవలం వ్యయం కాదు, అది రాబోయే భవిష్యత్ తరాలను శక్తివంతంగా నిర్మించడం కోసం పెట్టే అద్భుతమైన పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ?లక్ష్మీపురం స్కూల్ ఆవరణ అంతా తిరుగుతూ పనుల ప్రగతిని స్వయంగా అంచనా వేసిన డిప్యూటీ సీఎం. సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్, మెకానికల్ ల్యాబ్ భవనాల నిర్మాణ నాణ్యతపై అధికారులకు కీలక సూచనలు.
గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సదరు కాంట్రాక్టర్ కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, టి డబ్ల్యూ ఐ డి సి ఈఈ జనగాం బుగ్గయ్య, డి ఈ నాగేశ్వర చారి, మండల తహసిల్దార్ చల్లూరి సుధాకర్, ఏఈ బోయిన నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు, గోవిందాపురం ఎల్, లక్ష్మీపురం సర్పంచులు మందా కరుణ, మర్రి సిలువ, ముష్టికుంట్ల సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

# తెలంగాణ హక్కులు ఏపీకి తాకట్టు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పిన 194 కలిపితే 1005 టీఎంసీలు పున:పంపిణీ కింద సంక్రమిస్తాయి. అలాగే మరో45 టీఎంసీల నీటిని తెలంగాణకు ఇచ్చే విషయం ట్రిబ్యునల్ తేల్చబోతున్నది. మొత్తంగా 1050లో కనిష్టంగా 700 టీఎంసీలు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి మాత్రం 90 టీఎంసీలకు ఎన్ఓసీ ఇవ్వండి అన్ని నీళ్లు విడిచిపెట్టుకుంటం అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల నీటి వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరగనుంది" అని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరిలో కేటాయించిన 968 టిఎంసీలు, కృష్ణాలో రానున్న 1050 టీఎంసీల నీటికి సంబంధించిన ప్రాజెక్టుల క్లియరెన్స్ పూర్తయిన తర్వాతనే నదుల అనుసంధానం ప్రక్రియ గురించి మాట్లాడాలన్నారు. గతంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో తాము కావేరి అనుసంధానానికి అనుకూలమనీ, అయితే ఇచ్చంపల్లి లేదా, సమ్మక్క బ్యారేజీ ద్వారా తరలించాడానికి మాత్రమే ఒప్పుకున్నామని చెప్పారు. ఇంటర్ లింకేజిలో నీటిని తరలించే క్రమంలో స్థానిక రాష్ట్రానికి 50 శాతం వాటా ఉంటుందనీ, దాన్ని తెలంగాణకు ఇవ్వకుండా ఉండేందుకు పోలవరం నుంచి నేరుగా తరలించే కుట్రకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో ఉన్న 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు పోరాడాలని సూచించారు. ఏపీ నీటి దోపిడిపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

**301 టీఎంసీల నష్టం...** రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నీటి విధానం వల్ల గోదావరి, కృష్ణాలో మొత్తం 301 టీఎంసీలు నష్ట పోతామని హరీశ్‌రావు అన్నారు. "గోదావరి నీటి వాటా 968 టీంసీలో 828 టీఎంసీలకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) అనుమతించింది. మరో 139 టీఎంసీల అనుమతులు పెండింగ్ లో ఉన్నాయి. ఒక్కసారి పోలవరం-కావేరి లింక్ అయిన తర్వాత గోదావరిపై తెలంగాణ ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను కేంద్రం అనుమంతించదు. కేడబ్ల్యూడీటీ ముందు రెండు రాష్ట్రాలు నీటి వాటాలపై తమ వాదనలు ఇప్పటికే వినిపించాయి. త్వరలో అవార్డు రానున్న సందర్భంలో తెలంగాణ తొందరపడి పాలమూరుకు ఎన్వోసీ ఇస్తే పోలవరానికి ఒప్పు కోవడమంటే కృష్ణాలో 90 టీంసీలపై హక్కులు కోల్పోవాల్సి ఉంటుంది" అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవగాహన లేకుండా నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. గోదావరి కావేరీ లింక్ ప్రాజెక్టుకు, పాలమూరుకు లింక్ పెట్టడమంటే తెలంగాణ జల హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు.

# సంగారెడ్డిలో ఫిక్సింగ్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని, కానీ సింగూరు ప్రాజెక్టు 15 సంవత్సరాలుగా కుంగిపోతోందని తెలిపారు. హైదరాబాద్‌కు నీరు అందించడంతోపాటు 60 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణ మొట్టమొదటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్ రావు ఇక్కడ నుండే ప్రాతినిధ్యం వహిస్తున్నారని, సింగూరును పూర్తిగా పట్టించుకోకపోవడం వల్లే ప్రస్తుతం అది కుంగిపోయి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ విషయమై రఘునందన్ రావు నోరు మెదపడం లేదన్నారు. ఆందోల్‌లో ఒక మంత్రి బావమరిది 200 ఎకరాల భూమిని కబ్జా చేసినా అడిగే నాథుడే లేదని, పటాన్‌చెరు ఎమ్మెల్యే అసలు ఏ పార్టీలో ఉన్నారో కూడా ప్రజలకు తెలియడం లేదని అన్నారు. మన ప్రాంతాన్ని ప్రేమించే ప్రాంతీయ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని, టీఆర్ఎస్ పార్టీని ప్రజలు తమ 'ఇంటి పార్టీ'గా ఆదరించాలని కోరారు.

**'పాంచ జన్యం' పేరిట హామీలు** తెలంగాణలో టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పాంచ జన్యం పేరుతో ఉచిత విద్య, వైద్యం అందిస్తామని, వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక ఆఫీసర్లను నియమిస్తామని, యువతకు 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని కవిత హామీ ఇచ్చారు. ఉపాధి కోసం రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు బ్యాంకుతో సంబంధం లేకుండా సహాయం అందిస్తామన్నారు. సామాజిక న్యాయం పాటిస్తామని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల మోత మోగిపోతుందని తెలిపారు. ఈ హామీలపై నేనిచ్చిన మాట తప్పితే తెల్లాపూర్ శిలాశాసనం వద్ద కట్టేసి రాళ్లతో కొట్టండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి బాలయ్య, నాయకులు కరుణాకర్, నితిన్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

# 15న మోగనున్న బడిగంట

**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 07:** రాష్ట్రంలోని పాఠశాలల్లో ఈనెల15న బడి గంట మోగనుంది. ఈనెల 12వ తేదీకి బదులు 15న పునః ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు ఆదివారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వేసవి సెలవుల అనంతరం 12న పాఠశాలలు తిరిగి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, ఈనెల 13న రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో వేసవి సెలవులు పొడిగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈనెల 12వ తేదీన సెలవు ఇచ్చినందున.. విద్యా సంవత్సరం నష్టపోకుండా జులై 11న రెండో శనివారం తరగతులు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు."మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

## "నన్ను ఆపేటోడు తెలంగాణ గడ్డపై పుట్ట లేదు": కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహంగా అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడాన్ని ఆయన ప్రస్తావిస్తూ కలలో కూడా రాహుల్ ప్రధాని కాలేరని ఆయన తెలిపారు.

# నిటి ఆయోగ్ సమావేశానికి తమిళనాడు సీఎం

● ఢిల్లీకి రెండోసారి..




**చెన్నై,(ప్రజావినికిడి):జూన్ 07:** ఢిల్లీలో జరగనున్న నిటి ఆయోగ్ సమావేశంలో పాల్గొననున్నట్టు సంబంధిత వర్గాలు ఆదివారం తెలిపాయి. ప్రధాని మోడీ అధ్యక్షతన జూన్ 11న న్యూఢిల్లీలో నిటి ఆయోగ్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు హాజరుకానున్నారు. కేంద్రహోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలను విజయ్ కలిసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి హోదాలో ఢిల్లీలో పర్యటించడం ఇది రెండవసారి. జాతీయ రాజధానిలో తన మొదటి పర్యటనలో విజయ్ ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ 2.0 (ఉయిర్ నీర్ ఇయక్కం)ను అమలు చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో ఈ నెల 2వ తేదీన ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. తమిళనాడు ముఖ్యమంత్రి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్ సమక్షంలో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ వర్చువల్ సంతకాల కార్యక్రమంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తమిళనాడు వ్యాప్తంగా తాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, గృహాలకు సురక్షితమైన, సరిపడా తాగునీటిని నిరంతరాయంగా అందించడానికి ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన ముందడుగని అధికారిక ప్రకటన తెలిపింది.

# ఇది ట్రైలర్ మాత్రమే!.. లేకుంటే ఆందోళనలు ఉధృతం: అభిజీత్ దీప్కే

● వారంలోగా మంత్రి ప్రధాన్ దిగిపోవాల్సిందే



**న్యూఢిల్లీ,(ప్రజావినికిడి): జూన్ 07:** కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా, ఇతర డిమాండ్లతో శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తాము నిర్వహించిన ఆందోళన కేవలం ట్రైలర్ మాత్రమేనని, మంత్రి దిగేపోయే వరకు ఆందోళన కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. సీజేపీ ఆధ్వర్యంలో తొలిసారిగా జరిగిన నిరసనకు పెద్దయెత్తున తరలి వచ్చిన తల్లిదండ్రులు, వారి పిల్లలు, ఆందోళనకారులు, విద్యార్థులు, నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'నిన్నటి ఆందోళనకు వేలాది మంది హాజరై చరిత్ర సృష్టించారు. ఐక్యంగా ఉంటే బొద్దింకలు ఏమన్నా చేయగలవని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళన ద్వారా ప్రభుత్వానికి ఒక ట్రైలర్ చూపించాం' అని ఆయన ట్వీట్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి




**అమరావతి(ప్రజావినికిడి): జూన్ 07:** ఏపీలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. సామర్లకోటకు చెందిన సత్యనారాయణ ( 45 ), అరుణకుమారి ( 40 ) ద్విచక్రవాహనంపై సొంత ఊరుకు వెళ్తుండగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు వద్ద లారీ ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 8 జూన్ 2026

# బక్కని నరసింహులు.. సేవలకు ఏది గుర్తింపు.?

## గత 43 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలోనే సేవలు..

## బాబు తెలంగాణకు "రాజ్యసభ" ఇస్తారా..! ఎన్నో అవమానాలు,ఇబ్బందులు ఎదురైనా టీడీపీలోనే బక్కని..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** పదవులు రాకపోతే పార్టీలు మారే నాయకులు ఉన్న ఈ సమాజంలో..గత 43 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి నమ్మిన బంటుగా నిజాయితీ ఉన్న నాయకుడిగా నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్రస్థాయిలో ఎంతో గుర్తింపు పొందిన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులుకు రాజకీయాల్లో సరైన ప్రాధాన్యత గుర్తింపు కనుమరుగయింది.తెలంగాణలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న నర్సింహులు నేటి రాజకీయాలకు ఆయన భిన్నంగా ఉంటారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు తెలంగాణలో చేదోడు వాదోడుగా నిలిచి తలలో నాలుకలా ఉంటారంటే అతిశయోక్తి కాక తప్పదు.

గత 43 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని అంటిపెట్టుకొని నిజాయితీగా నిబద్ధతగా పార్టీలోని ఉంటున్నారు.

రాష్ట్రంలో రాజకీయంగా ఎన్ని అవమానాలు, ఇబ్బందులు ఎదురైనా పార్టీ నే నమ్ముకుని ముందుకు సాగుతున్నారు.తెలంగాణ ఏర్పాటు తర్వాత తెలుగుదేశం పార్టీ దాదాపు కనుమరుగైంది. అయినా నమ్ముకున్న పార్టీని విడిచిపెట్టకుండా నేటికీ ఆ పార్టీలోని కొనసాగుతున్నారు

తెలుగుదేశం పార్టీలో ఏ కార్యకర్తకు దక్కని అదృష్టం నర్సింహులుకు లభించింది.

మహానుభావుడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ పగ్గాలు తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా నర్సింహులు చేపట్టడం ఒక రికార్డుగా చెప్పవచ్చు.తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా సేవలు అందించిన ఆయన పదవి అనతికాలంలోని చేజారిపోయింది. ఆయన స్థానంలో బీసీ నాయకుడు ఎల్ రమణను నియమించారు. అయితే రమణ బిఆర్ఎస్ పార్టీలో చేరాక టిడిపి పార్టీకి గట్టి దెబ్బ తగిలింది.ఆ తర్వాత బక్కని నరసింహులు నియమించారు. ఏం జరిగిందో తెలియదు కానీ 2022లో కాసాని జ్ఞానేశ్వర్ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు.ఆయన కూడా మధ్యంతరంగా పార్టీని వెళ్లిపోయారు.

ఎంతో నిజాయితీగా ఉన్న బక్కని నర్సింహులును కాదని నియమించిన వారు పార్టీని మోసం చేసి వెళ్లిపోయిన బక్కని మాత్రం తెలుగుదేశం పార్టీలో ఒక నిజాయితీ గల నాయకుడిగా నిబద్ధతగా సేవలు నేటికి అందిస్తూ వస్తున్నారు.అయితే తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రెండు కళ్ళు అంటూ చెప్పిన పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు






రాజ్యసభ పదవుల విషయంలో తెలంగాణకు న్యాయం చేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అంతేకాదు పార్టీలో ఎంతో నమ్మకస్తుడైన బక్కని నరసింహులుకు అవకాశం దక్కుతుందా అని పలువురు ఎదురుచూస్తున్నారు. ఇటీవలే పార్టీ తరపున పార్లమెంట్ ఎగువ సభకు పంపే ముగ్గురు అభ్యర్థుల పేర్లను టీడీపీ పార్టీ ఖరారు చేస్తూ అధిష్ఠానం శనివారం రాత్రి అధికారికంగా ప్రకటించింది.పార్టీ పట్ల అంకితభావం,

సామాజిక సమతుల్యతతో పాటు యువ నాయకత్వానికి పెద్దపీట వేస్తూ వారిని ఎంపిక చేసినట్టు పార్టీ స్పష్టం చేసింది.భాష్యం రామకృష్ణ,సానా సతీష్, చింతకాయల విజయ్ కు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బి.ఫారాలు అందజేశారు.

మూడో పదవిని ఎస్సీ లేదా బీసీకి ఇవ్వాలని భావిస్తుండగా..వారిలో ఎవరిని ఎంపిక చేయాలనేది తేలితే మూడుసీట్లకు అభ్యర్థుల్ని ప్రకటిస్తారని చెబుతున్నారు.మరి బీసీ వైపు మొగ్గు చూపుతారా, ఎస్సీని రాజ్యసభకు పంపిస్తారా ఎస్సీ వైపు ప్రాధాన్యత ఇస్తే తెలంగాణ నుండి బక్కని నరసింహులుకు అవకాశం ఇస్తారా అని పలువురు అంటున్నారు. తెలంగాణపై అభిమానం ప్రేమ ఉంటే బక్కనికి మంచి పదవిని ఇచ్చే విషయం ఆలోచించాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.బక్కని రాజకీయాల్లో తన నిజాయితీని తెలుగుదేశం పార్టీలో నిరూపించుకున్నారు.ఇకపోతే చంద్రబాబు కూడా తనకు తెలంగాణలో నమ్మిన బంటుగా ఉన్న బక్కనికి రాజ్యసభలో ప్రాధాన్యత ఇస్తారా అన్నది వేచి చూడాలి.43 ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకొని తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి జీవగంచజిపోస్తున్న కరుడుగట్టిన నేతకు సముహిత స్థానం లభిస్తుందా చూడాలి.

### ఇంతకు ఎవరి "బక్కని"

షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన బక్కని నర్సింలు 1983లో తెలుగుదేశం పార్టీలో సాధారణ కార్యకర్తగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. నరసింహులు 1994లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ పి.శంకరరావు పై 45,822 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. ఆయన 1999లో జరిగిన ఎన్నికల్లో టిడిపి,బీజేపీ పొత్తుల్లో భాగంగా బీజేపీకి ఈ స్థానం కేటాయించడంతో ఆయన పోటీకి దూరంగా ఉన్నారు.నరసింహులు 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.శంకరరావు చేతిలో 10,632 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

అనంతరం ఆయన తెలుగుదేశం పార్టీ షాద్‌నగర్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా,టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా,కార్యనిర్వాహక కార్యదర్శిగా,ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా,టీటీడీ(తిరుపతి) పాలకమండలి సభ్యుడిగా,టీడీపీ ఎన్నికల కమిటీ సభ్యుడిగా, క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా,టీడీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.బక్కని నరసింహులు 2014 పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ లోక్‌సభ నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నర్సింహులు 19 జూలై 2021న తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడయ్యారు.బక్కని నర్సింహులు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా,జాతీయ కార్యదర్శిగా 2022 నవంబరు 04న నియమితుడయ్యారు.

# ఫరూఖ్‌నగర్ మండలంలో ప్రీ-ప్రైమరీ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లు,ఆయాల నియామకం

## మండల విద్యాధికారి మనోహర్ వెల్లడి



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రీ-ప్రైమరీ తరగతులు మంజూరు అయినట్లు ఫరూక్ నగర్ మండల విద్యాధికారి మనోహర్ తెలిపారు.పీఎస్ వెలిజర్లతో పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పీఎస్ రాంనగర్ కాలనీ,పీఎస్ క్రిస్టియన్ కాలనీ,పీఎస్ ఆర్టీసీ కాలనీ,పీఎస్ వెంకటేశ్వర కాలనీ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

ఈ తరగతుల నిర్వహణ కోసం ఇన్‌స్ట్రక్టర్ (అర్హత: ఇంటర్మీడియట్) మరియు ఆయా (అర్హత:7వ తరగతి) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు.ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ బుధవారం సాయంత్రంలోపు (ఆదివారం సెలవు) మండల విద్యా వనరుల కేంద్రం(ఎంఆర్సీ) ఫరూఖ్‌నగర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీచర్ ట్రైనింగ్ (డీఎల్ఎడ్/డీఈడ్)అర్హత కలిగిన వారికి, అలాగే స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎంఈఓ మనోహర్ తెలిపారు.మరిన్ని వివరాల కోసం (9603554546) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ మేరకు మండల విద్యాధికారి మనోహర్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## చౌదరి గూడ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** షాద్ నగర్ నియోజకవర్గంలోని జిల్లేడ్ చౌదర్‌గూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణంలో ఉన్న ఇంటి స్లాబ్ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాయినోనిపల్లి చంద్రశేఖర్ ప్రారంభించారు.లబ్ధిదారులు ఎర్ర మనోజ్,యాదయ్యలకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి స్లాబ్ వేడుకలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో ప్రజా పాలనలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, గూడెం,తండాలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వాలు చేయని విధంగా పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసిందని,ఇండ్ల మంజూరులో ఎలాంటి వివక్ష లేకుండా కులం,మతం,పార్టీతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజా ప్రభుత్వానికి,గత పాలకుల విధానాలకు ఉన్న తేడా పేదలకు ఇళ్లు అందించడంలో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి,బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకట్ రాములు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమార్,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్,సర్పంచ్ శివ,బంధయ్య సర్పంచ్‌తో పాటు భూమగల్లఆదిత్య,నర్సింలు,యాదయ్య,యాదగిరి,శ్రీశైలం,రాములు, నరేష్,రమేష్,సుమన్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుమతులు లేకున్నా కాలనీ లో వెలుస్తున్న కార్పొరేట్ కళాశాలలు..



**హైదరాబాద్,(ప్రజావినికిడి):** హబ్సిగూడ లోని స్ట్రీట్ నెంబర్ 3 లో కాలనీ మధ్యలో అనుమతులు లేకున్నా నడిపిస్తున్న కార్పొరేట్ కళాశాలను కాలనీ వాసులు కాలేజీ ముందు నిరసన వ్యక్తపరిచారు. తమ కాలనీ లో కళాశాలను ఏర్పాటు చేయటం తో ట్రాఫిక్ సమస్యలతో పాటు రోజు పిల్లల గొడవలు గోలలతో తమ ప్రశాంతతకు భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్పొరేట్ కళాశాలకు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆంతే కాకుండా ఇక్కడ కళాశాల ఏర్పాటును కాలనీ వాసులు కోర్టు నుండి స్టే ఆర్డర్ తెచ్చుకున్న కళాశాల యాజమాన్యం, ప్రభుత్వ ఉద్యోగులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ధ్వజమెత్తారు. ప్రశాంతంగా ఉండే కాకతీయ నగరులో వాహనాల రాకపోకలు పెరిగి వాహన ధ్వనులతో ఉదయం మధ్యాన్నం మారుమోగుతోంది తెలిపారు. ఇదంతా



చూస్తూ కాలనీ పాలక వర్గం తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరించటం తో అనుమానాలను రేకెత్తిచే విధంగా ఉందని తెలియజేసారు.కాలనీ పాలక వర్గ విభేదాలను కూడా ఈ కళాశాల యాజమాన్యం తమకు అనువుగా ఉన్నవారితో కలసి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారనే అనుమానాలను వ్యక్త పరుస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు ఈ విషయం లో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలనీ కాలనీ వాసుల డిమాండ్ చేస్తున్నారు.ఈ నిరసనలో బొమ్మగొని రఘుపతి గౌడ్, మనీష్ రెడ్డి నరోత్తం రెడ్డి బాబురావు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అధిక ధరలను తగ్గించాలని జూన్ 10న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు జయప్రదం చేయండి..

## ప్రజలకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నరసింహ పిలుపు..






**నాగోల్,(ప్రజావినికిడి):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాగోల్ డివిజన్ సాయి నగర్ ప్రాంత జనరల్ బాడీ సమావేశం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.నాగోల్ చౌరస్తా నుండి వందలాదిమంది సిపిఐ కార్యకర్తలు జెండాలు చేతపట్టుకుని డప్పుల నృత్యాలతో ర్యాలీగా సాయి నగర్ పార్టీ కార్యాలయం వరకు చేరుకోవడం జరిగింది. అనంతరం జరిగిన సభలో

ముఖ్యఅతిథిగా వచ్చేసిన సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ టి నరసింహ మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ అదేవిదంగా సిలిండర్ ధరలను నిరంతరం పెంచుతూ పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు.

బడా కార్పొరేట్ సంస్థలైన ఆయిల్ కంపెనీల ప్రయోజనాల కోసం విపరీతంగా ధరలు పెంచడం మూలంగా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుకున్నాయి. ప్రతి వస్తువు రేటు పెరగటంతో సామాన్యుల పూటగడడం భారంగా మారింది.

మరో వైపు కార్పొరేట్ అనుకూల విధానాల మూలంగా

రోజురోజుకు పతనమైతున్న రూపాయి మారకపు విలువ. సంక్షోభంలోకి ఆర్థిక వ్యవస్థ..

మత విద్వేషాలతో ఎక్కువ కాలం పరిపాలన సాగించడం సాధ్యం కాదు.

కేంద్ర బీజేపీ ప్రభుత్వ అసమర్థ పాలన మూలంగానే కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం.

విద్యావ్యవస్థను సమూలంగా నాశనం చేస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు.కేంద్రంలో ఉన్న అన్ని వ్యవస్థల్లోకి ప్రవేశిస్తూ విధ్వంసానికి పాల్పడుతున్నారునీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని రోడ్ల మీదకు వచ్చి బాధిత కుటుంబాల తల్లిదండ్రులు నిరసన తెలుపడం అభినందనీయం.

సాయి నగర్ ఏరియా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ముందుండి పోరాటం నిర్వహిస్తుందనీ సిపిఐ




హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అన్నారు.

ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ అలాగే సాయి నగర్ ఏరియా శాఖల కార్యదర్శులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## భారత రాష్ట్ర సమితి రాష్ట్ర యువజన నాయకులు సిరికొండ శివ ప్రకాష్ జన్మదిన వేడుకలు



**చైతన్యపురి, జూన్,7 (ప్రజా వినికిడి):**
ఎల్బీనగర్ నియోజకవర్గం లోని చైతన్యపురి డివిజన్ లో తెలంగాణ శాసన సభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనచారి కుమారుడు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పుట్టినరోజు సందర్భంగా శివ ప్రకాష్ ఆధ్వర్యంలో మెగా వైద్యం శిబిరం,రక్త దాన శిబిరం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి సిబ్బందికి శివ ప్రకాష్ చీరలు, బహుమతులు పంపిణి చేశారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు.జన్మదిన వేడుకలలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పాల్గొని రక్తదానం చేసిన యువకులను అభినందించి, ప్రశంస పత్రాలను అందజేశారు. పుట్టినరోజు వేడుకల్లో పెద్ద సంఖ్యలో డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యూత్ నాయకులు,శివ ప్రకాష్ అభిమానులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శివ ప్రకాష్ మాట్లాడుతూ,తనపై ఇంత ప్రేమ, అభిమానం చాటిన తన అభిమానులకు, బిఆర్ఎస్ నాయకులకు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.డివిజన్ ప్రజలకు తాను నిరంతరం అందుబాటులో వుంటూ వారి కష్టసుఖాల్లో భాగం అవుతానని అన్నారు.

## 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి.. సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఆక్రమణల తొలగింపు, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) వ్యవస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో పేరు పెట్టానని ఆయన స్వయంగా చెప్పడమే ఈ వివాదానికి కారణమైంది. బెంగళూరులో నిన్న జరిగిన 'ది హిందూ' హడిల్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.చెరువులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై హైడ్రా ఏజెన్సీ తీసుకుంటున్న కఠిన చర్యలను సమర్థించుకుంటూ రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైడ్రా అనే పదం హిట్లర్‌కు చాలా ఇష్టమైనది. ఆయన కోర్ టీమ్‌ను హైడ్రా అని పిలిచేవారు, వారు ఎవరినైనా హతమార్చగలరు. అందుకే నేను హిట్లర్ నుంచి స్ఫూర్తి పొంది దీనికి హైడ్రా అని పేరు పెట్టాను" అని ఆయన వివరించారు.అయితే, రేవంత్ రెడ్డి వాదనలో చారిత్రక నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్‌కు 'హైడ్రా' పేరుతో ఎలాంటి హంతక బృందం లేదని, వాస్తవానికి నాజీ జర్మనీపై బ్రిటన్ వైమానిక దళం జరిపిన బాంబు దాడి ఆపరేషన్‌కు ఆ పేరుందని చరిత్రకారులు చెబుతున్నారు.ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది కాంగ్రెస్ పార్టీ 'హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి' నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. దీన్ని 'తానాషాహి' (నియంతృత్వం) అని అభివర్ణించారు. గతంలో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ, ఇది కాంగ్రెస్ నైజమని విమర్శించారు. అటు బీఆర్ఎస్ పార్టీ కూడా రేవంత్ వ్యాఖ్యలను ఖండించింది. సోషల్ మీడియాలో సైతం ఈ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

## కూచిపూడి కళకు పట్టం కట్టిన రాగ్ని కళానిలయం

### 41 రోజుల శిక్షణకు ముగింపు.. వైభవంగా వార్షికోత్సవ వేడుకలు..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రాగ్ని కూచిపూడి కళానిలయం తొలి వార్షికోత్సవ వేడుకలు,రెండవ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం పట్టణంలోని ఠాగూర్ స్కూల్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.
రాగ్ని కూచిపూడి కళానిలయం ఆధ్వర్యంలో శివ మారుతి గీతా అయ్యప్ప కళ్యాణమండపంలో నిర్వహించిన 41 రోజుల వేసవి శిక్షణ శిబిరంలో 50 మంది విద్యార్థినులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ అందించారు.ఈ కార్యక్రమానికి హరీశ్ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించగా,
రవిశర్మ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్,ఠాగూర్ స్కూల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్,విశ్వహిందూ పరిషత్ నాయకులు బండారు రమేష్,ప్రముఖ సామాజికవేత్త, కార్మిక నాయకుడు పినపాక ప్రభాకర్,రిటైర్డ్ తహసీల్దార్ రామారావు,ప్రముఖ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.
శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థినులకు అతిథులు మెమెంటోలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు ప్రాచీన భారతీయ



నృత్య కళ అయిన కూచిపూడిని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్న నృత్య గురువు రాగ్నిని ప్రత్యేకంగా అభినందించారు. వందలాది మంది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ కళా సంప్రదాయాన్ని పరిరక్షిస్తున్నారని కొనియాడారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.
అలాగే రాగ్ని తల్లిదండ్రులు, ప్రముఖ జ్యోతిష్యులు మరియు పురోహితులు రవిశర్మ దంపతులను, నృత్య గురువు రాగ్నిని అతిథులు సన్మానించారు. అనంతరం నిర్వాహకులు మాధురి-రవిశర్మ దంపతులు ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా



నృత్య గురువు రాగ్ని మాట్లాడుతూ శివ మారుతి కళ్యాణమండపంలో వారానికి మూడు రోజుల పాటు కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, కళాభిమానులు సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు,
పట్టణ ప్రముఖులు,కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ పేరుతో ప్రజలని మోసం చేస్తున్నారు

**సూరన్న..**

**స్వర్గసీమ వెంచర్ పై ప్రశ్నించినందుకు సూరన్న టీవీకి లీగల్ నోటీసులు..**

**ప్రజలకు వాస్తవాలు తెలపమని చెప్పడం తప్పా..**

**ఇటీవల రియల్ ఎస్టేట్ పేరుతో చాలా మంది దొంగ వెంచర్లతో ప్రజలను మోసం చేస్తున్నారు..**

**ప్రజా సంక్షేమం కోసం వాళ్లకు కావాల్సిన పత్రాలు చూసుకోవాలని సూచించిన సూరన్న టీవీ..**

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
స్వర్గసీమ వెంచర్‌కు సంబంధించిన ప్రకటనలు,ప్రచార సామగ్రి,భూముల వివరాలపై పలు సందేహాలు వ్యక్తం చేస్తూ సూరన్న టీవీలో ప్రత్యేక వీడియో ప్రసారం చేయబడిందని ప్రజలు పెట్టుబడులు పెట్టే ముందు అన్ని అనుమతులు, లేఅవుట్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు పూర్తిగా పరిశీలించాలని ఆ వీడియోలో సూరన్న సూచించారు.
అయితే
ఆ వీడియో ప్రసారం అనంతరం, వీడియోను తొలగించాలని కోరుతూ సూరన్న టీవీకి లీగల్



నోటీసులు అందినట్లు సమాచారం.ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రశ్నలు అడగడం, ఆధారాలను పరిశీలించడం మీడియా బాధ్యతలో భాగమని సూరన్న టీవీ వర్గాలు పేర్కొంటున్నాయి.
ఏదైనా వెంచర్ లేదా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు, భూ హక్కుల పత్రాలు,లేఅవుట్ ఆమోదాలు,ఇతర చట్టపరమైన అంశాలను పరిశీలించడం కొనుగోలుదారుల బాధ్యత అని నిపుణులు చెబుతున్నారు. కేవలం ప్రకటనలను నమ్మి నిర్ణయం తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని సూరన్న ప్రజలకు వివరించారు.
లీగల్ నోటీసులు పంపించడం ఒక చట్టబద్ధమైన ప్రక్రియ అయినప్పటికీ, ప్రజా ప్రయోజనాల కోసం ప్రశ్నలు అడిగే మీడియా సంస్థలను భయపెట్టేందుకు వాటిని ఉపయోగించకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. వాస్తవాలు, ఆధారాలు, చట్టపరమైన అంశాలే చివరికి నిజానిజాలను నిర్ణయిస్తాయని వారు అంటున్నారు.
"ప్రజల డబ్బు, ప్రజల భవిష్యత్తు" అనే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని సూరన్న టీవీ తన పరిశోధనాత్మక కథనాలను కొనసాగిస్తుందని, లీగల్ నోటీసులు వచ్చినంత మాత్రాన ప్రజా సమస్యలపై గొంతెత్తడం ఆగదని సూరన్న స్పష్టం చేస్తున్నారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# మహేశ్వరంలోని ప్రభుత్వ భూములలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు..

### కోట్ల విలువైన ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న మాఫియా..

### రెవెన్యూ,మైనింగ్ అధికారులపై తీవ్ర అనుమానాలు.. -వందల లారీల సంచారం.. పట్టించుకొని పోలీసులు..

**మహేశ్వరం,(ప్రజావినికిడి):**
మహేశ్వరం మండలంలో ప్రభుత్వ భూములు మట్టి మాఫియాకు అడ్డాగా మారాయనే ఆరోపణలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.స్థానికుల కథనం ప్రకారం ఇండస్ట్రియల్ ఏరియా వెనుక భాగంలో ఉన్న కమ్మగుట్ట పరిసరాల్లోని సర్వే నంబర్ 65తో పాటు డబుల్ బెడ్ రూమ్ కాలనీ పక్కకు సర్వే నంబర్ 461లో భారీ ఎత్తున మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.
ప్రతిరోజూ రాత్రి దాదాపు 8 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తూ వందలాది లారీల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ వ్యవహారం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న ఈ అక్రమ దందా వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టం జరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు, అక్రమ మైనింగ్‌ను






అడ్డుకోవాల్సిన మైనింగ్ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మహేశ్వరం మండల ఎమ్మార్వో,ఆర్ఐ, జీపీఓలు ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. ఇది అధికారుల బాధ్యతారాహిత్యమా? లేక అక్రమార్కులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
ఇంత భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుగుతుంటే సంబంధిత శాఖలకు సమాచారం లేకపోవడం సాధ్యమేనా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. రాత్రిపూట వందల సంఖ్యలో లారీలు రహదారులపై తిరుగుతున్నప్పటికీ



పోలీసుల దృష్టికి రాకపోవడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా జరుగుతున్న ఈ కార్యకలాపాలపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.అక్రమ మట్టి తవ్వకాల కారణంగా భూభాగ స్వరూపం మారిపోవడంతో పాటు భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే



ప్రమాదం ఉందని, పెద్ద పెద్ద చెట్లను సైతం కనుమరుగు చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూములు క్రమంగా ఖాళీ అవుతుండగా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
మహేశ్వరంలో జరుగుతున్న ఈ అక్రమ మట్టి దందాపై జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్,మైనింగ్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను దోచుకుంటున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని ప్రజా సంపదను కాపాడాలని కోరుతున్నారు. అక్రమ తవ్వకాల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు.? అధికారుల పాత్ర ఏమిటి.? అనే అంశాలపై ఏసీబీ అధికారులచే లోతైన దర్యాప్తు జరిపితేనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.మరి దీనిపై రెవిన్యూ,మైనింగ్ శాఖ మంత్రులు, జిల్లా కలెక్టర్ ఏలా స్పందిస్తారో వేచి చూడాలి.

# జ్యుయెలరీ ఫ్యాక్టరీలో విష వాయువులు లీక్

## నలుగురు కార్మికులు దుర్మరణం

**గుజరాత్:** లోని ప్రముఖ ఇండస్ట్రియల్ సిటీ సూరత్ లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఓ జ్యుయెలరీ పరిశ్రమలో విషవాయువులు లీక్ అయ్యి ఒక సూపర్‌వైజర్ సహా నలుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. అశ్విని కుమార్ రోడ్డులోని జ్యుయెలరీ పరిశ్రమలో జ్యుయెలరీ తయారీ ప్రక్రియలో వెలువడే రసాయన వ్యర్థాలను సేకరించేందుకు ఓ ఈటీపీ సెప్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి 2 నెలలకు ఒకసారి ఈ ట్యాంక్‌ను శుభ్రం చేయాల్సి ఉంటుంది.

ఎప్పటిలాగే ఇవాళ ఉదయం ఓ సూపర్‌వైజర్, ముగ్గురు కార్మికులతో కూడిన నలుగురు సభ్యుల బృందం ఆ ట్యాంక్‌ను క్లీన్ చేయడానికి వెళ్లింది. ట్యాంక్ క్లీన్ చేస్తున్న సమయంలో ఓ కార్మికుడు అకస్మాత్తుగా లోపలికి జారిపడిపోయాడు. అతనిని కాపాడే క్రమంలో మిగిలిన ముగ్గురు కూడా ఒకరి వెనుక ఒకరు ట్యాంక్ లోపలికి దిగారు. అయితే ట్యాంక్‌లో అప్పటికే పేరుకుపోయిన రసాయనాల వల్ల తీవ్రమైన విషవాయువులు వెలువడటంతో.. ఊపిరాడక నలుగురు



అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయి ప్రాణాలు విడిచారు.ఆపుటేజీల పరిశీలించిన అనంత రం.. కార్మికులు సేఫ్టీ మాస్క్‌లు ధరించలేదని స్పష్టమైందని పోలీసులు తెలిపారు. రసాయన వ్యర్థాల వల్ల ఏర్పడిన పాయిజనస్ గ్యాస్ కారణంగానే వారు మరణించినట్లుగా భావిస్తున్నామని అన్నారు. పూర్తి వివరాలు పోస్ట్‌మార్టం నివేదిక వచ్చాకే తెలుస్తాయని పేర్కొన్నారు.

ట్యాంక్ లోపలికి దిగే ముందు సూపర్‌వైజర్ అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసినప్పటికీ వారు వచ్చేలోపే వీరు లోపలికి దిగడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ట్యాంక్ నుంచి నలుగురి మృతదేహాలను వెలికితీసి ఆసుపత్రికి తరలించారు.

# ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకూడదని

## మెట్రోల ప్రయాణించిన డీకే శివకుమార్

**కర్ణాటక:** ముఖ్యమంత్రి గా పదవీ బాధ్యతలు స్వీకరిం చిన తర్వాత డీకే శివకుమార్ తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కనకపుర లో పర్యటించారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు , ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విధాన సౌధ మెట్రోస్టేషన్ నుంచి కనకపుర మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు.

ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకూడదని.. మెట్రోల ప్రయాణించిన డీకే శివకుమార్

కర్ణాటక ముఖ్యమంత్రి గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత డీకే శివకుమార్ (ఐఖ తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కనకపుర లో పర్యటించారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విధాన సౌధ మెట్రోస్టేషన్ నుంచి కనకపుర మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు

ఏ విధమైన హంగూ ఆర్భాటాలు లేకుండా ఒక సామాన్యుడిలా మెట్రో ఎక్కిన ముఖ్యమంత్రిని



చూసి తోటి ప్రయాణికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ప్రయాణంలో భాగంగా ఆయన రైల్లోని ప్రయాణికులతో చాలా సాదాసీదాగా, సరదాగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెట్రో ప్రయాణం ముగిసిన తర్వాత కనకపుర స్టేషన్ వద్ద దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముందుకు సాగారు. వినూత్నంగా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెట్రోను ఎంచుకున్న సీఎం డీకే శివకుమార్‌పై బెంగళూరు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లో విషాదం

## డ్యాన్స్ చేస్తూ యువకుడు మృతి



**ముంబై:**మహానగరం ముంబై వర్లీలోని ప్రసిద్ధ 'ఎన్ఎస్‌సీఐ డోమ్ లో జరిగిన ఓ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్ ఊహించని విషాదంతో ముగిసింది. వేలాది మంది సంగీతాభిమానుల కోలాహలం మధ్య ఓ 28 ఏళ్ల యువకుడు అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని ముంబైలోని మాహిమ్ ప్రాంతానికి చెందిన 28 వృషభ్ మహేంద్ర గాంగుర్దే గా పోలీసులు గుర్తించారు. తన స్నేహితులతో కలిసి ఈ కాన్సర్ట్‌కు హాజరైన వృషభ్.. డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కిందపడిపోయాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. విపరీతమైన రద్దీ కారణంగా వృషభ్‌తోపాటు అతనితో ఉన్న ఒక యువతి కూడా తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. స్పృహతప్పిన వృషభ్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించినప్పటికీ, అతడు అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఆ యువతి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని, ఆమె పరిస్థితి స్థిరంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై తార్దేవ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వృషభ్ ఆరోగ్య పరిస్థితి విషమించడానికి ముందు అతను మద్యం సేవించి ఉండవచ్చని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నప్పటికీ, ఏదైనా ఇతర పదార్థాల ప్రభావం ఉందా అనే కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు.పోస్ట్‌మార్టం నివేదిక ఇతర వైద్య నివేదికలు వచ్చిన తర్వాతే యువకుని మరణానికి గల ఖచ్చితమైన కారణం తెలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ దారుణ ఘటన ముంబైలో భారీ స్థాయిలో జరిగే కాన్సర్ట్‌ల భద్రతా ఏర్పాట్లపై చర్చకు తెరలేపింది. ఎన్ఎస్‌సీఐ క్లబ్ సభ్యుడు ఒకరు మాట్లాడుతూ.. అంత భారీ సంఖ్యలో జనం వచ్చినప్పుడు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు తీసుకోలేదని, ఆరోపించారు.

# ఇండియా బ్లాక్ సమావేశానికి మమతా బెనర్జీ

## టీఎంసీకి కీలకంగా మారనున్న సమావేశం

**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ మళ్లీ రాజకీయంగా పుంజుకోవడానికి ప్రయత్నిసు న్నా రు. దీనిలో భాగంగా చాలా కాలం తర్వాత ఇండియా బ్లాక్ సమావేశానికి మమ త హాజరుకానున్నారు. ఇందుకోసం మమత ఢిల్లీకి బయల్దేరారు. సోమవారం ఈ సమావేశం జరగనుంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఈ సమావేశానికి నేతృత్వం వహించనుంది.పతిపక్షాల కూటమిగా ఉన్న ఇండియా బ్లాక్ ప్రస్తుతం భవిష్యత్ రాజకీయాలపై దృష్టిపెట్టింది. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వరుసగా ఓటమి చవిచూస్తున్నాయి. బీజేపీ చేతిలో పరాజయం పాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమావేశం కీలకం కానుంది. సమావేశానికి 23 పార్టీలు హాజరవుతాయని కాంగ్రెస్ వెల్లడించింది. టీఎంసీ ఘోర ఓటమి తర్వాత ఆ పార్టీకి ఈ మీటింగ్ కీలకం కానుంది. అక్కడ బీజేపీ భారీ విజయం సాధించింది. ఇది రాజకీయంగా భారీ చర్చకు దారితీసింది. ఇటీవల ముగిసిన ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్ సమావేశం జరగడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ రాజకీయంగా ఎదగడం



ఆయా పార్టీలకు ఇబ్బందిగా మారిం ది.ఇండియా కూటమిలో విబేదాల తర్వాత ఇంతకాలానికి అన్ని ఎక్కువ పార్టీలు ఏకమవుతున్నాయి. ఇండియా బ్లాక్ తన లక్ష్యాల్ని మళ్లీ నిలబెట్టుకోవాలని నిర్ణయించి ంది. ఇండియా బ్లాక్‌కు నాయకత్వం, సమన్వయం, రాబోయే ఎన్నికల్లో కలిసి పని చేయడంపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, ఈ మీటింగ్‌కు డీఎంకే హాజరు కావడం లేదు. ఇంతకాలం డీఎంకే.. ఇండియా కూటమిలో కీలకంగా ఉంది. అయితే, కాంగ్రెస్ పార్టీ తమిళనాడులు డీఎంకేను కాదని టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీ కాంగ్రెస్‌పై వ్యతిరేకతతో ఉంది. అందుకే, ఈ కూటమికి డీఎంకే దూరంగా ఉండనుంది.

# ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాలకు భారీ నష్టం

## సాయమందించనున్న అమెరికా ప్లాన్స్ ఇవే



**అమెరికా,:** అమెరికా, ఇజ్రాయెల్ కలిపి ఇరాన్‌పై దాడి చేస్తే.. ఇరాన్.. గల్ఫ్ దేశాలపై విరుచుకుపడింది. దీంతో యూఏఈ, కువైట్ వంటి గల్ఫ్ దేశాలు భారీగా నష్టపోయాయి. అమెరికాకు ఇవి మిత్రదేశాలు. నిజానికి ఈ యుద్ధంలో గల్ఫ్ దేశాలకు నేరుగా సంబంధం లేదు. అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ యుద్ధం జరుగుతోంది. అమెరికాకు సైనికపరంగా ఆశ్రయం ఇవ్వడమే గల్ఫ్ దేశాలకు శాపంగా మారింది. భారీగా నష్టపోయాయి. విమానాశ్రయాలు, చమురు ఉత్పత్తి కేంద్రాలు వంటివి నాశనమ య్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా.. తన మిత్ర దేశాలకు తన వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అమెరికా ట్రెజర్ డిపార్ట్‌మెంట్ కీలక నిర్ణయా లు తీసుకుంది. ఇందులో కూడా ఇరాన్ ఆస్తుల్ని వినియోగించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మె ంట్ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మిడిల్ ఈస్ట్ యుద్ధం కారణంగా ఆయా దేశాలకు కలిగిన నష్టంపై నివేదిక ఇవ్వాలని అధికారులు ఆదేశించారు.

ఇరాన్ చమురు ట్యాంకర్లు, ఇరాన్ నుంచి సీజ్ చేసిన ఆస్తుల్ని వినియో గించి గల్ఫ్ దేశాలకు సాయం అందిస్తాయా అనేది చూడాలి.ఇరాన్‌కు చెందిన సీజ్ చేసిన బ్యాంక్ అకౌం ట్లోని డబ్బుల్ని, ఇతర ఆస్తుల్ని వాడుకుని గల్ఫ దేశాలకు నిధులు సమకూర్చా లని అమెరికా భావిస్తోంది. ఈ విషయంలో త్వరలోనే స్పష్టత రానుంది.

మరోవైపు బహ్రెయిన్, కువైట్‌లపై ఇరాన్ దాడి చేస్తోం ది. ప్రతిగా అమెరికా కూడా ఇరాన్‌పై దాడి చేస్తోంది. బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేస్తోం ది. ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నా ఇరు దేశాలు దాడి చేసుకుంటున్నాయి.

మరోవైపు ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలోనే చర్చలు ముగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు.

# భారత్‌లో జననాల రేటు తగ్గుదలపై ఎలాన్ మస్క్

## పోస్ట్ సోషల్ మీడియాలో చర్చ




**భారత్:** ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ భారత్‌కు సంబంధించి చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ చర్చనీయాంశం అయ్యింది. భారత్ లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై మీడియా సంస్థ 'ఏఎఫ్ పోస్ట్' షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. భారత్‌లో జననాల రేటు ప్రతిస్థాపన స్థాయి కంటే తగ్గిందని, ముఖ్యంగా బాగా చదువుకున్న వారిలో ఈ రేటు చాలా ఏళ్ల క్రితమే పడిపోయిందని తన పోస్టులో పేర్కొన్నారు.

భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని 'ఏఎఫ్ పోస్ట్' నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే ఈ రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. ఢిల్లీలో అయితే ఈ రేటు 1.2 కి పడిపోయిందని, ఇది ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక పేర్కొన్నది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025' కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9 గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువ అని స్పష్టం చేసింది.

సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారి దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని నివేదిక విశ్లేషించింది. అయితే జననాల రేటు తగ్గుతున్నప్పటికీ 146 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతోంది. 2023లో చైనాను అధిగమించి భారత్ ఈ స్థానానికి చేరుకుంది. విద్య, పట్టణీకరణ పెరగడం, మహిళలు ఉద్యోగాల్లో చేరడం, మారుతున్న కుటుంబ ప్రాధాన్యతలు వంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక తెలిపింది.

# అమెరికాలో మళ్లీ కాల్పులు

## 12 మందికి తీవ్ర గాయాలు



**అమెరికా:**అమెరికా లో మరోసారి కాల్పుల కలకలం చెలరేగింది. ఒహియో రాష్ట్రం లోని టోలెడో నగరంలో శనివారం సాయంత్రం జరిగిన 'ఓల్డ్ వెస్ట్ ఎండ్ ఫెస్టివల్ లో దుండగులు జరిపిన కాల్పుల్లో కనీసం 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, పండుగ వాతావరణంలో ఒక్కసారిగా బుల్లెట్ల వర్షం కురవడంతో జనం ప్రాణాలు అరచేత బట్టుకుని పరుగులు తీశారు. చారిత్రాత్మక నగరమైన టోలెడోలో 53వ వార్షిక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయిలైవ్ మ్యూజిక్, ఫ్యామిలీ ఈవెంట్లతో కుటుంబా లన్నీ పండుగను ఆస్వాదిస్తున్న తరుణంలో అమెరికా కాలమాన ప్రకారం.. సాయంత్రం 5:37 గంటల ప్రాంతంలో డెలావేర్, గ్లెన్‌వుడ్ అవెన్యూల సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకరిపై ఒకరు పరస్పరం కాల్పులు జరుపుకోగా అక్కడ గుమిగూడిన సామాన్య ప్రజలు ఈ క్రాస్‌ఫైరింగ్‌లో చిక్కుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే టోలెడో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రక్షించారు.గాయపడిన వారిలో 14 ఏళ్ల మైనర్ల నుంచి 61 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారని డిప్యూటీ పోలీస్ చీఫ్ జో హెఫెర్నన్ తెలిపారు. ఘటనా స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి, బాధితులను వెంటనే స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ హింసాత్మక ఘటన తర్వాత ఉత్సవానికి సంబంధించిన మిగిలిన అన్ని కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు స్థానిక యంత్రాంగం ప్రకటిం చింది. కాల్పులకు తెగబడిన నిందితులెవరూ ఇప్పటివరకు పోలీసులకు చిక్కలేదు. వారు ఘటనా స్థలం నుంచి పరారైనట్లు అధికారులు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను, ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలను పరిశీలిస్తున్నారు. పండుగకు వచ్చిన వారు తమ మొబైల్స్‌లో తీసిన ఫోటోలు లేదా వీడియోలను దర్యాప్తు కోసం అందించాలని పోలీసులు కోరారు. ఈ ఘోర కాల్పుల ఘటనను ఒహియో గవర్నర్ మైక్ డివైన్ తీవ్రంగా ఖండించారు.

# కొత్త కారు కొనాలనే వారికి గుడ్‌న్యూస్ భారీ
# డిస్కౌంట్లు ప్రకటించిన కంపెనీలు



**న్యూఢిల్లీ,** : కొత్త కార్లను కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఇది మీకు శుభవార్త. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలు ఒకేసారి భారీగా రాయితీని ఇస్తున్నట్టు ప్రకటించాయి. మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్‌లు ఏకంగా తమ మాడళ్లపై రూ.2.15 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు వెల్లడించాయి. ఈ ఆఫర్లు ప్రస్తుత నెలకు మాత్రమే వర్తించనున్నాయని, వీటిని నగదు డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపింగ్ ఇన్సెంటివ్స్, లాయల్టీ రివార్డ్, కార్పొరేట్ ప్రయోజనాలు కలుపుకొని ఎంపిక చేసిన మాడళ్లపై రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపాయి.

**హ్యుందాయ్..**

హ్యుందాయ్ మోటర్స్ ఎంపిక చేసిన మాడళ్లపై లక్ష రూపాయల వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. క్రెటా ఎస్‌యూవీని కొనుగోలు చేసిన వారికి లక్ష రూపాయల వరకు డిస్కౌంట్ ఇస్తున్న సంస్థ..వెర్నాపై రూ.95 వేలు, అప్‌డేటెడ్ మాడల్‌పై రూ.55 వేలు, క్రెటా ఎలక్ట్రిక్ మాడల్‌పై రూ.85 వేల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని ఆటోకార్ ఇండియా తాజాగా వెల్లడించింది. వీటితోపాటు గ్రాండ్ ఐ10 నియోస్‌పై రూ.78 వేలు, అల్కాజర్‌పై రూ.75 వేలు, ఐ20, ఐ20 ఎన్ లైన్ మాడల్‌పై రూ.63 వేలు, ఎక్సటర్‌పై రూ.43 వేల డిస్కౌంట్, ఔరా మాడల్‌పై రూ.25 వేలు, వెన్యూపై రూ.5 ప్రయోజనాలు కల్పిస్తున్నది.

**టాటా మోటర్స్...**

పలు ప్యాసింజర్ వాహనాలపై రూ.55 వేల వరకు రాయితీ ఇస్తున్నట్టు టాటా మోటర్స్ ప్రకటించింది. ఈ ఆఫర్లు 2026లో విడుదలైన ఎస్‌యూవీలు, పంచ్, టియాగో మాడళ్లు ఉన్నాయి. వీటిలో నెక్సాన్‌పై రూ.55 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్న సంస్థ..కర్వ్‌పై రూ.55 వేలు, హారియర్, సఫారీ ఎస్‌యూవీపై రూ.45 వేల వరకు, అల్ట్రోజ్ రూ.40 వేల వరకు, టియాగోపై రూ.35 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది.

**మారుతి కార్లపై**

మారుతి సుజుకీ కూడా రాయితీలను ప్రకటించింది. ఇన్విక్టో ఎంపీవీ పై రూ.2.15 లక్షల వరకు రాయితీ ఇస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. దీంతోపాటు గ్రాండ్ విటారాపై రూ.1.35 లక్షల వరకు, ఇగ్నిస్‌పై రూ.45 వేలు, బాలెనోపై రూ.40 వేలు, ఎక్స్‌ఎల్‌ఆర్‌పై రూ.45 వేలు, జిమ్నీపై రూ.45 వేలు, ఫ్రాంక్స్‌పై రూ.25 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. వీటిలో ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ రివార్డులు, కార్పొరేట్ డిస్కౌంట్లు ఇస్తున్నది.

# దిగివస్తున్న బంగారం ధర. వరుసగా మూడో రోజూ తగ్గుముఖం



దేశంలో బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలకు తోడు దేశీయంగా డిమాండ్ మందగించడంతో పసిడి ధరలు దిగివస్తున్నాయి. జూన్ 7 నాటి ట్రేడింగ్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.300 తగ్గి.. రూ.1,52,730 వద్దకు చేరింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి ధర రూ.2.7 లక్షలుగా నమోదైంది. విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే.. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,54,910గా ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,000గా ఉంది. ముంబైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,150 వద్ద కొనసాగుతోంది. శనివారం భారత మార్కెట్లో మేలిమి బంగారం సగటు ధర రికార్డు స్థాయిలో రూ.3,000 మేర తగ్గగా.. వెండి ధరలోనూ రూ.10 వేల మేర తగ్గుదల నమోదైంది.

# సిలిండర్ ధర పెరిగినా భారత్‌లోనే గ్యాస్ చౌక
# యూఎస్, కెనడాలో రేట్లు చూస్తే గుండె గుబేలే




ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో సగటున 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలను భారత కరెన్సీ విలువ ప్రకారం పరిశీలిస్తే అంతరాయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. అక్కడ వంట గ్యాస్ ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. అమెరికా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో కూడా నివాస గృహాల కనెక్షన్ల వ్యయం, సిలిండర్ల రేట్లు అంతర్జాతీయ ఇంధన ధరల ఒత్తిడి కారణంగా భారత్ కంటే గణనీయంగా ఎగువనే ఉన్నాయి.

**ధరల స్థిరత్వానికి భారత్ చర్యలు**

అంతర్జాతీయంగా ఎల్‌పీజీ ధరలను నిర్ణయించే సౌదీ అరామ్‌కో కాంట్రాక్ట్ ప్రైస్ గత కొన్నేళ్లుగా భారీగా పెరిగినప్పటికీ దేశీయంగా ఆ భారం వినియోగదారులపై పూర్తిగా పడకుండా కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు కేంద్రం పేర్కొంది. ప్రభుత్వ చమురు మార్కెటింగ్ కంపెనీలు అంతర్జాతీయ నష్టాలను కొంత మేర భరిస్తూ దేశీయ మార్కెట్లో ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకకుండా నియంత్రించగలిగినట్లు తెలిపింది. పీఎం ఉజ్వల యోజన లబ్ధిదారుల కు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక సబ్సిడీల వల్ల పేద కుటుంబాలకు మరింత ఉపశమనం లభిస్తోందని కేంద్రం గుర్తు చేసింది.

# సుకన్య యోజనతో పాప పెళ్లికి రూ.71 లక్షలు కానీ, ఈ ఒక్క
# తప్పు చేస్తే ఆ డబ్బు భారీగా తగ్గిపోతుంది చూసుకోండి




ఆడ పిల్లల ఉన్నత చదువులు, పెళ్లి ఖర్చుల కోసం రూపకల్పన చేసిన సుకన్య సమృద్ధి యోజన ప్రస్తుతం దేశంలోనే అత్యధిక వడ్డీ అందిస్తున్న ప్రభుత్వ పొదుపు పథకాల్లో ఒకటి. పన్ను మినహాయింపులు, గ్యారెంటీ రిటర్న్లు ఉండడంతో లక్షలాది మంది తల్లిదండ్రులు ఇందులో ఇన్వెస్ట్ చేస్తున్నారు. అయితే, చాలా మంది తమకు వీలున్నప్పుడు లేదా నెల చివర్లో ఈ ఖాతాలో డబ్బులు డిపాజిట్ చేస్తున్నారు. ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం ఇలా చేయడం వల్ల మెచ్యూరిటీ సమయంలో మీ అమ్మాయి చేతికి రావాల్సిన అసలు లాభంల వేల రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ పథకం గరిష్ఠ లాభం పొందడానికి పాటించాల్సిన ఆ ఒక్క కీలక రూల్ ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.

**వడ్డీని లెక్కించే 5వ తేదీ మాయాజాలం**సుకన్య సమృద్ధి పథకంలో వడ్డీని ప్రతి నెలవారీగా లెక్కిస్తారు (కానీ ఖాతాకు ఏడాదికి ఒకసారి మాత్రమే జమ చేస్తారు). ఈ వడ్డీని లెక్కించేటప్పుడు ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన రూల్ పాటిస్తుంది. అదే ప్రతి నెలా 5వ తేదీ నుంచి ఆ నెల చివరి రోజు వరకు మీ ఖాతాలో ఉన్న అత్యంత తక్కువ బ్యాలెన్స్ మీద మాత్రమే ఆ నెల వడ్డీని లెక్కిస్తారు. అంటే 5వ తేదీలోపు జమ చేసిన వారికి అధిక లాభం ఉంటుంది.

**నెల చివర్లో డిపాజిట్ చేస్తే జరిగే నష్టం**

ఉదాహరణకు మీరు ప్రతి నెలా 10వ తేదీన లేదా 20వ తేదీన రూ.10 వేలు అకౌంట్లో జమ చేశార అనుకుందాం.

ఐదో తేదీ నాటికి ఆ డబ్బు అకౌంట్లో లేదు కాబట్టి ప్రభుత్వం ఆ నెలకు మీరు కొత్తగా వేసిన రూ.10 వేలపై వడ్డీని లెక్కించదు. పాత బ్యాలెన్స్ మీదే వడ్డీ వస్తుంది.

# 50 ఏళ్ల వయసు నుంచే నెలకు రూ.2,00,000 పెన్షన్
# ఈక్విటీ డెట్ పెట్టుబడితో బెస్ట్ రిటైర్మెంట్ ప్లాన్




ప్రస్తుత రోజుల్లో చాలా మంది ఉద్యోగులు ముందస్తు పదవీ విరమణను అన్వేషిస్తున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం అనేది కేవలం సంపదను కూడబెట్టడం కంటే ఎక్కువగా మారుతోంది. నేటి పదవీ విరమణదారులు 30-40 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు సాగే రిటైర్మెంట్ కాలంలో నిలకడైన ఆదాయం, సౌలభ్యం, పన్ను సామర్థ్యం, ద్రవ్యోల్బణం నుంచి రక్షణ కోసం చూస్తున్నారు. అందువల్ల, మూలధనాన్ని కాపాడుకుంటూనే క్రమం తప్పకుండా ఆదాయం సృష్టించగల పటిష్టమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించడం అనేది పదవీ విరమణ ప్రణాళికలో అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటిగా మారింది. మీరు 50 ఏళ్ల వయసులోనే రిటైర్మెంట్ కావాలనుకుంటే మీకో బెస్ట్ బెస్ట్ ప్లాన్ ఉంది. దాని ద్వారా మీరు నెలకు రూ.2 లక్షల వరకు ఆదాయం అందుకోవచ్చు. త్వరగా పదవీ విరమణ చేసి, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు దగ్గరగా నివసించడానికి వేరే ప్రాంతానికి వెళ్లాలని యోచిస్తున్న 47 ఏళ్ల ఓ పెట్టుబడిదారుడు దీర్ఘకాలిక స్థిరత్వం కోసం పోర్ట్‌ఫోలియోను ఎలారూపొందించుకోవాలనే దానిపై నిపుణుల మార్గదర్శకత్వం కోరుతూ ఈటీ మ్యూచువల్ ఫండ్ను సంప్రదించారు. పిల్లలు లేని ఆ పెట్టుబడిదారు, అతని జీవిత భాగస్వామికి ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్‌లు, ఈక్విటీలు, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, బంగారం, రియల్ ఎస్టేట్‌లలో విస్తరించి ఉన్న వైవిధ్యభరితమైన పెట్టుబడి నిధి ఉంది. దీని నుంచి నెలకు సుమారు రూ. 2 లక్షల ఆదాయం రావాలని వారు లక్ష్యంగా పెట్టుకున్నారు, ఇది కాలక్రమేణా ద్రవ్యోల్బణంతో పాటు పెరగాలనుకు ంటున్నారు.ఆయనకు మ్యూచువల్ ఫండ్లలో రూ. 5.5 కోట్లు, డైరెక్ట్ ఈక్విటీ (స్టాక్స్)లో రూ. 60 లక్షలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్ అకౌంట్‌లో రూ. 1.8 కోట్లు ఉన్నాయి. అయితే, ఇటీవల పనితీరు సరిగా లేని మ్యూచువల్ ఫండ్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించు కున్నారు. రాబోయే 5 సంవత్సరాల క్రమం తప్పకుండా ఆదాయం కోసం ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ లేదా అగ్రెసివ్ హైబ్రిడ్, మల్టీ అసెట్, డైనమిక్ అసెట్ అలోకేషన్, దీూఖీలో ఎలా కేటాయించాలనే దానిపై మార్గదర్శక త్వం కోరుతున్నారు.ప్లాన్ ఇలామార్కెట్ నిపుణుడు, ఫండ్స్ ఇండియా సీఈఓ డిజిటల్ (దీ2జ) రిషబ్ గార్గ్ అతడి పోర్ట్‌ఫోలియోను విశ్లేషించారు. ఆ కుటుంబం ప్రస్తుత రూ. 12.5 కోట్ల నిధి ప్రధానంగా ఈక్విటీ (49 శాతం), డెట్ (21 శాతం), రియల్ ఎస్టేట్ (17 శాతం), బంగారం (13 శాతం) లలో కలిగి ఉన్నాయి. అందువల్ల ఒకే పోర్ట్‌ఫోలియో కేటాయింపును అనుసరించడానికి బదులుగా, లక్ష్యం ఆధారిత ఫ్రేమ్‌వర్క్‌ను ఆయన సిఫార్సు చేశారు.సుమారు మూడేళ్లలో ప్రారంభం కానున్న పదవీ విరమణ ప్రణాళిక కోసం వృద్ధి, మూలధన పరిరక్షణను సమతుల్యం చేయడానికి 60 శాతం ఈక్విటీ, 40 శాతం డెట్‌లో సమతుల్య కేటాయింపు చేయాలని గార్గ్ సూచిస్తున్నారు.

దీర్ఘకాలిక సంపద సృష్టి కోసం 70 శాతం ఈక్విటీ, 15 శాతం డెట్, 15 శాతం బంగారంలో ఉండే మరింత వృద్ధి-ఆధారిత మిశ్రమాన్ని ఆయన సిఫార్సు చేస్తున్నారు. వాళ్ల దగ్గర ఉన్న సంపదతో మ్యూచువల్ ఫండ్స్‌లోని సిస్టమాటిక్ విత్ డ్రాయల్ ప్లాన్ ద్వారా పెట్టుబడి పెట్టాలని చెబుతున్నారు. రూ.12.5 కోట్ల కార్పస్‌ను పైన సూచించిన విధంగా విభజించి ఇన్వెస్ట్ చేస్తూ నెలకు రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని సూచిస్తున్నారు.

# స్క్రాప్ డీలర్ ఆదాయం రూ.3 లక్షలే కానీ రూ.44 లక్షలకు ట్యాక్స్ నోటీసు
# పంపిన ఐటీ శాఖ బ్యాంక్ ఖాతాతో ఎంత పనైంది




దేశంలో డిజిటల్ లావాదేవీలు ఎంత వేగంగా పెరుగుతున్నా అసంఘటిత రంగంలో ఇప్పటికీ నగదు ట్రాన్సాక్షన్లదే పైచేయిగా చెప్పవచ్చు. అయితే, ఐటీ రిటర్నులలో చూపించే ఆదాయానికి, బ్యాంక్ ఖాతాల్లో జరిగే క్యాష్ డిపాజిట్లకు పొంతన లేకపోతే ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ వెంటనే రంగంలోకి దిగుతుంది. ఇలాంటి ఒక కేసులో బ్యాంక్ ఖాతాలో రూ.1.28 కోట్ల నగదు డిపాజిట్ చేసి కేవలం రూ.3 లక్షల వార్షిక ఆదాయాన్ని ప్రకటించిన ఒక పాత సామాన్య వ్యాపారికి ఐటీ శాఖ ఐటీ శాఖ ఏకంగా రూ.44 లక్షల భారీ పన్ను నోటీసులు పంపించింది. కానీ, ఈ వివాదంలో ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ పుణే బెంచ్ కీలక నిర్ణయం తీసుకుంది. అది చిన్న వ్యాపారులకు పెద్ద ఊరటగా మారింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.

వజీద్ ఖాన్ అనే వ్యక్తి గత 10 సంవత్సరాలుగా స్క్రాప్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నారు. ఆయన ఆర్థిక సంవత్సరం 2015-16కు గాను తన ఆదాయపు పన్ను రిటర్నుల్లో కేవలం ర.3,00,340 వార్షిక ఆదాయాన్ని ప్రకటించారు. అయితే, ఐటీ శాఖకు చెందిన అధునాత ఇన్‌సైట్ పోర్టల్ ఆయన కో-ఆపరేటివ్ బ్యాంకు ఖాతాను స్కానింగ్ చేయగా అందులో ఏకంగా రూ.1,28,26,078 క్యాష్ డిపాజిట్ అయినట్లు గుర్తించింది. ఆదాయానికి, డిపాజిట్‌కు భారీ వ్యత్యాసం ఉండడంతో ఐటీ అధికారులు సెక్షన్ 147 కింద ఈ కేసును రీ-ఓపెన్ చేశారు. స్క్రాప్ డీలర్‌కి రూ.44 లక్షలు పన్ను డిమాండ్ నోటీసులు పంపించారు.ఐటీ అధికారుల నోటీసులకు స్పందిస్తూ తనది పాత సామాన్య వ్యాపారమని, ఇందులో అన్నీ నగదు రూపంలోనే లావాదేవీలు జరుగుతాయని వజీద్ ఖాన్ వివరణ ఇచ్చారు. ప్రిజంప్టివ్ టాక్సేషన్ కింద టర్నోవర్ లో 8 శాతం లాభాన్ని పరిగణన లోకి తీసుకోవాలని కోరారు. అయితే, దురదృష్టవశాత్తూ తన కంప్యూటర్ హార్డ్ డ్రైవ్ కు వైరస్ సోకడం వల్ల అకౌంటింగ్ డేటా మొత్తం డిలీట్ అయిపోయిందని, అందుకే పూర్తి బిల్లులు సమర్పించలేకపోతున్నానని ఆయన తెలిపారు. సదరు వ్యాపార దగ్గర తగిన రికార్డులు లేకపోవడంతో అసెస్సింగ్ ఆఫీరస్ ఆ వివరణను తోసిపుచ్చారు. రూ.1.28 కోట్ల మొత్తాన్ని అన్ ఎక్స్‌ప్లైన్డ్ మనీ గా పరిగణనించి దానిని సెక్షన్ 115బీబీఈ కింద జరిమానాలతో కలిపి దాదాపు రూ.44 లక్షల ట్యాక్స్ డిమాండ్ విధించారు. మొదటి అప్పీలులో కూడా ఆయనకు ఎలాంటి ఉపశమనం లభించలేదు.వ్యాపారి ఐటీఏటీ ని ఆశ్రియంచడంతో ఈ కేసు ఊహించని మలుపు తిప్పింది. వజీద్ ఖాన్ తన పాత, తర్వాత సంవత్సరాల ఐటీ అసెస్మెంట్ రికార్డులను ట్రైబ్యునల్ ముందు ఉంచారు. ఆయా సంవత్సరాల్లో కూడా తన బిజినెస్ మోడల్ ఇలాగే ఉందని, అప్పుడు ఐటీ శాఖ తన 8 శాతం ప్రాఫిట్ ఎస్టిమేషన్ పద్ధతిని ఎలాంటి అభ్యంతరం లేకుండా ఆమోదించినట్లు నిరూపించారు. దీనిపై విచారణ జరిపిన ఐటీఏటీ బెంచ్, సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ల్యాండ్ మార్క్ తీర్పులను ఉటంకిస్తూ ప్రిన్సిపల్ ఆఫ్ కన్సిస్టెన్సీ ను తెరపైకి తెచ్చింది. ఒకే వ్యాపార శైలిని, అకౌంటింగ్ పద్ధతిని ఐటీ శాఖ గతంలోనూ, మున్ముందూ ఆమోదించినప్పుడు కేవలం ఒక సంవత్సరంలో రికార్డులు లేవనే కారణంతో మొత్తం డిపాజిట్లను అక్రమ ఆదాయంగా భావించడం సరికాదని స్పష్టం చేసింది.

# బంగారం రేట్లు ఇంకా తగ్గుతాయా




పెరుగుతున్న బంగారం ధరలను చూసి బెంబేలెత్తిపోతున్న సామాన్యులకు, ఇన్వెస్టర్లకు గత వారం మార్కెట్ పెద్ద ఊరటనిచ్చింది. ఎప్పుడూ ఆకాశమే హద్దుగా దూసుకుపోయే పసిడి, వెండి ధరలు గత వారం ఒక్కసారిగా భారీ తగ్గుదల దిశగా అడుగులు వేశాయి. దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా కుప్పకూలడంతో.. అసలు బంగారం ధరలు ఇంకా తగ్గుతాయా? ఇప్పుడు కొనుగోలు చేయడం మంచిదేనా? అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో అటు అంతర్జాతీయంగా, ఇటు దేశీయంగా రేట్లు ఎందుకు పడిపోయాయో నిపుణుల విశ్లేషణ ఎలా ఉంది. గత వారం మార్కెట్లో ఏం జరిగింది దేశీయ కమోడిటీ మార్కెట్ (వీజశ) లో గత వారం పూర్తిగా ప్రతికూల వాతావరణం నడిచింది. అమ్మకాల ఒత్తిడి తట్టుకోలేక ధరలు భారీగా పతనమయ్యాయి.

**బంగారం ధర:** ఆగస్టు డెలివరీకి సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా రూ.5,317 (3.3 శాతం) తగ్గి, 10 గ్రాములకు రూ.1.55 లక్షల వద్ద ముగిసింది.

**వెండి ధర:** జూలై డెలివరీ సిల్వర్ ధర ఏకంగా రూ.18,461 (7 శాతం) పడిపోయి, కిలోకు రూ.2.48 లక్షల మార్కుకు చేరుకుంది.



# టీమిండియా టీ20 కెప్టెన్సీ.. తొలిసారి స్పందించిన శ్రేయస్ అయ్యర్

భారత టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ నియామకంఇదొక గొప్ప గౌరవమంటూ బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపిన అయ్యర్ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు ఆసియా గేమ్స్‌కు అయ్యర్ సారథ్యంభారత టీ20 క్రికెట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఎంపికైన విషయం తెలిసిందే. ఈ కీలక బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా స్పందించారు. రానున్న ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు 2026 ఆసియా గేమ్స్‌లోనూ టీమిండియాను అయ్యర్ నడిపించనున్నాడు. ముంబై టీ20 లీగ్‌లో ఓ మ్యాచ్ అనంతరం మాట్లాడిన అయ్యర్, తనపై నమ్మకం ఉంచిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు.దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నాడు. “భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే ప్రత్యేకం. అలాంటిది ఇప్పుడు జట్టుకు నాయకత్వం వహించడం మరింత ఆనందాన్ని ఇస్తోంది. కేవలం పరుగులు చేయడమే కాకుండా, కెప్టెన్సీతో జట్టును విజయాల బాట పట్టించడం ‘ఐసింగ్ ఆన్ ది కేక్’ లాంటిది. ఇన్నేళ్లుగా నాపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ, మద్దతుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను“ అని శ్రేయస్ అయ్యర్ వ్యాఖ్యానించాడు.కెప్టెన్సీ మార్పుపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వివరణ మరోవైపు కెప్టెన్సీ మార్పుపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టత ఇచ్చాడు. రాబోయే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేయాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించాడు. సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడం తేలికైన నిర్ణయం కాదని అగార్కర్ అంగీకరించాడు. అయితే, జట్టు దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా ఈ మార్పు అవసరమైందని తెలిపాడు.“అన్ని ఫార్మాట్లలో శ్రేయస్ అయ్యర్ స్థిరంగా రాణిస్తున్నాడు. అతడిలో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని అతడికి సారథ్య బాధ్యతలు అప్పగించాం“ అని అగార్కర్ పేర్కొన్నాడు. ఈ కొత్త బాధ్యతతో శ్రేయస్ అయ్యర్ ముందు పెద్ద సవాలు ఉంది. కెప్టెన్‌గా తనను తాను నిరూపించుకోవడంతో పాటు రాబోయే కీలక టోర్నమెంట్లలో జట్టును విజయపథంలో నడిపించాల్సిన గురుతర బాధ్యత అతడిపై ఉంది.



# 19 ఏళ్ల పిన్న వయసులో ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన రష్యన్ భామ

ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన మిర్రా ఆండ్రీవా1992లో సెలెస్ తర్వాత ఈ ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డుఫైనల్‌లో క్వాలిఫయర్ మాయా స్వాలిన్‌స్కాపై 6-3, 6-2 తేడాతో విజయంఆండ్రీవాకు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌టెన్నిస్ ప్రపంచంలో సరికొత్త తార ఉదయించింది. రష్యాకు చెందిన 19 ఏళ్ల మిర్రా ఆండ్రీవా ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించారు. శనివారం జరిగిన ఫైనల్ పోరులో పోలండ్ క్వాలిఫయర్ మాయా స్వాలిన్‌స్కాపై 6-3, 6-2 తేడాతో నేరుగా సెట్లలో విజయం సాధించారు. ఈ విజయంతో, 1992లో మోనికా సెలెస్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ గెలుచుకున్న అతి పిన్న వయస్కురాలిగా ఆండ్రీవా సరికొత్త రికార్డును నెలకొల్పారు.ఫిలిప్ చాట్రియర్ కోర్టులో జరిగిన ఈ తుదిపోరులో ఆండ్రీవా అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. కేవలం గంటా 22 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. టోర్నీ ఆద్యంతం కేవలం ఒక్క సెట్ మాత్రమే కోల్పోయిన ఆండ్రీవా, ఫైనల్‌లో 25 విన్నర్లతో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు.మరోవైపు, టోర్నమెంట్‌లో వరుస విజయాలతో ఫైనల్ వరకు దూసుకొచ్చిన క్వాలిఫయర్ మాయా స్వాలిన్‌స్కా పోరాటం ఫలించలేదు. అయితే, ఓపెన్ ఎరాలో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన తొలి క్వాలిఫయర్‌గా ఆమె రికార్డు సృష్టించారు. ఈ ప్రదర్శనతో మాయా తన కెరీర్ బెస్ట్ 21వ ర్యాంకుకు చేరుకోనుండగా, విజేత ఆండ్రీవా 6వ ర్యాంకుకు చేరుకోనున్నారు. ఛాంపియన్‌గా నిలిచిన ఆండ్రీవాకు 2.8 మిలియన్ యూరోలు, రన్నరప్‌గా నిలిచిన మాయాకు 1.4 మిలియన్ యూరోల ప్రైజ్‌మనీ లభించింది. ఈ విజయంతో ప్రస్తుత తరం మేటి క్రీడాకారిణిగా ఆండ్రీవా టెన్నిస్ ప్రపంచంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

## ఆఫ్ఘన్‌తో టెస్టు.. 564 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్

ఆఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్టులో భారత్ భారీ స్కోరు564/8 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన టీమిండియాశతకాలతో మెరిసిన శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్‌రిషభ్ పంత్, సాయి సుదర్శన్ అర్ధశతకాలుఆఫ్ఘన్ బౌలర్ సలీం సఫీ 6 వికెట్ల ప్రదర్శనఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు భారీ స్కోర్ సాధించింది. రెండో రోజు ఆట రెండవ సెషన్‌లో టీమిండియా తమ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. భారత బ్యాటర్లు శుభ్‌మన్ గిల్ (126), కేఎల్ రాహుల్ (101) శతకాలతో కదం తొక్కారు.ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం చేలాయించారు. గిల్, రాహుల్ సెంచరీలతో బలమైన పునాది వేయగా, మిడిలార్డర్‌లోనూ పరుగుల వరద కొనసాగింది. రిషభ్ పంత్ (81), సాయి సుదర్శన్ (81) అర్ధశతకాలతో రాణించి జట్టు స్కోరును మరింత పెంచారు. వాషింగ్టన్ సుందర్ 52 పరుగులతో అజేయంగా నిలిచాడు.మహ్మద్ సిరాజ్ 12 బంతుల్లోనే 22 పరుగులు చేయడం విశేషం. అందులో 4 ఫోర్లు, 1 సిక్సు ఉండడం సిరాజ్ దూకుడుకు నిదర్శనం. కొత్త కుర్రాడు మానవ్ సుతార్ 2 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 28 పరుగులు చేశాడు. భారత బ్యాటర్లు విజృంభించినప్పటికీ, ఆఫ్ఘనిస్థాన్ బౌలర్ మహ్మద్ సలీం సఫీ తన అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.






# వైభవ్ సూర్యవంశీకి బంపరాఫర్.. యువ కెరటం కోసం బీసీసీఐ కీలక నిర్ణయం

15 ఏళ్లకే టీమిండియాలోకి వచ్చిన యువ సంచలనం వైభవ్ ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనలకు తల్లిదండ్రులను తీసుకెళ్లేందుకు అనుమతి వారి ప్రయాణ ఖర్చులన్నీ బీసీసీఐయే భరిస్తుందని ప్రకటన భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించిన 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి బీసీసీఐ అండగా నిలిచింది. ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికైన వైభవ్, రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు తన తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లేందుకు బీసీసీఐ అనుమతి ఇచ్చింది. అంతేగాక వారి ప్రయాణ ఖర్చులన్నీ బోర్డే భరిస్తుందని ప్రకటించింది.స్పోర్ట్‌స్టార్ కథనం ప్రకారం అంతర్జాతీయ క్రికెట్ ఒత్తిడిని, కొత్త వాతావరణాన్ని తట్టుకుని నిలబడటానికి కుటుంబ సభ్యుల తోడు అతనికి ఎంతో సహాయపడుతుందని బీసీసీఐ భావిస్తోంది. “అతను ఇంకా చిన్నపిల్లవాడు కావడంతో కొత్త వాతావరణంలో సులభంగా సర్దుకుపోవడానికి అతని తల్లిదండ్రులను కూడా వెంట తీసుకెళ్లేందుకు అనుమతించాం. వారి ప్రయాణ ఖర్చులన్నీ బోర్డే భరిస్తుంది“ అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది. ప్రస్తుతం వైభవ్, ట్రై-నేషన్ సిరీస్ కోసం ఇండియా-ఏ జట్టుతో కలిసి శ్రీలంక పర్యటనలో ఉన్నాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ సూర్యవంశీ అసాధారణ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ టోర్నీలో మొత్తం 776 పరుగులు సాధించి, టాప్ స్కోరర్‌గా ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అంతేగాక ‘మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‘, ‘ఎమర్జింగ్ ప్లేయర్‘ అవార్డులను కూడా గెలుచుకున్నాడు. ఈ అద్భుత ప్రదర్శనే అతనికి ఐర్లాండ్, ఇంగ్లండ్, ఆసియా క్రీడల కోసం టీమిండియా టీ20 జట్టులో చోటు కల్పించింది.వైభవ్ తనను తానే ఎంపిక చేసుకున్నాడు: చీఫ్ సెలక్టర్ అగార్కర్ ఈ యువ ఆటగాడి ఎంపికపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. “వైభవ్ తన ప్రదర్శనతో తనను తానే జట్టులోకి ఎంపిక చేసుకున్నాడు. అతని గురించి మేం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్లేఆఫ్స్‌లో దాదాపు ఒంటిచేత్తో రాజస్థాన్ రాయల్స్‌ను నడిపించాడు. అంత పోటీ, ఒత్తిడి ఉండే ఐపీఎల్‌లో ఒక యువ ఆటగాడు ఈ స్థాయిలో రాణించడం అసాధారణం. అతను మ్యాచ్ గమనాన్ని మార్చగల సత్తా ఉన్న ఆటగాడు. అందుకే అతనిపై మాకు భారీ అంచనాలు ఉన్నాయి“ అని అగార్కర్ స్పష్టం చేశాడు.



# అరంగేట్రంలోనే మానవ్ సుతార్ అదుర్స్.. ఆఫ్ఘన్‌పై పట్టుబిగించిన భారత్

మొహాలీలో భారత్-ఆఫ్ఘన్ ఏకైక టెస్టు564 పరుగుల భారీ స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్‌కెరీర్ లో తొలి టెస్టు ఆడుతున్ స్పిన్నర్ మానవ్ సుతార్‌కు 3 వికెట్లురెండో రోజు ఆట ముగిసేసరికి ఆఫ్ఘనిస్థాన్ 113/5451 పరుగుల భారీ ఆధిక్యంలో టీమిండియాఫాలో-ఆన్ గండంలో ఆఫ్ఘన్ జట్టుఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. తొలి ఇన్నింగ్స్ లో భారీ స్కోరు సాధించిన గిల్ సేన, అనంతరం బౌలింగ్‌లోనూ చెలరేగి ఆఫ్ఘన్ జట్టును పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆఫ్ఘనిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. భారత జట్టు కంటే ఇంకా 451 పరుగులు వెనుకబడి ఉంది. అరంగేట్రం చేసిన లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ 3 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు.అంతకుముందు, 564/8 పరుగుల వద్ద భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) బాధ్యతాయుతమైన అర్ధశతకం సాధించగా, మహమ్మద్ సిరాజ్ (22) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. సుందర్ హాఫ్ సెంచరీ పూర్తి కాగానే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి, బౌలర్లకు రెండు సెషన్ల సమయం ఇచ్చాడు.తొలి ఇన్నింగ్స్ ఆడేందుకు బరిలో దిగిన ఆఫ్ఘనిస్థాన్ ఆదిలోనే తడబడింది. పదునైన బంతులతో అదరగొట్టిన మానవ్ సుతార్, అబ్దుల్ మాలిక్‌ను తన తొలి వికెట్‌గా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కృష్ణ నిప్పులు చెరిగే బంతితో సెదిఖుల్లా అటల్ వికెట్ తీశాడు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లపై ఒత్తిడి పెంచిన సుతార్, రహ్మానుల్లా గుర్బాజ్‌ను కూడా ఔట్ చేశాడు.ఒకవైపు వికెట్లు పడుతున్నా, రహ్మత్ షా (43 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెట్‌లో 1000 పరుగులు పూర్తి చేసుకున్న తొలి ఆఫ్ఘన్ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. కెప్టెన్ హష్మతుల్లా షాహిదితో కలిసి 36 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పినప్పటికీ, ప్రసిద్ధ్ కృష్ణ అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కాసేపటికే అఫ్సర్ జజాయ్, సుతార్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ ఫాలో-ఆన్ గండంలో పడింది. రేపు ఆటకు మూడు రోజు కాగా, ఆఫ్ఘన్ జట్టును వీలైనంత త్వరగా ఆలౌట్ చేయాలని టీమిండియా భావిస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# చిరంజీవి-బాబీ మూవీలో కన్నడ బ్యూటీ రచితా రామ్!

మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మెగా158' సినిమా గురించి ఒక ఆసక్తికరమైన కాస్టింగ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్ర కోసం మొదట మలయాళ బ్యూటీ హనీ రోజ్‌ను అనుకున్నారు. అయితే డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుని, అడ్వాన్స్ కూడా వెనక్కి ఇచ్చేసిందని ఇండస్ట్రీ టాక్. ఇప్పుడు ఆ కీలక పాత్ర కోసం కన్నడ స్టార్ హీరోయిన్ రచితా రామ్‌ను మేకర్స్ ఫైనల్ చేసినట్లు తెలుస్తుంది. గతంలో 'సూపర్ మచ్చి' చిత్రంలో నటించిన రచితకు తెలుగులో ఇది రెండో సినిమా. కూలీ సినిమాతో రచితకు మంచి గుర్తింపు రాగా.. ఈ సినిమా మరింత ప్లస్ కాబోతుందని సమాచారం. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కొల్లి కాంబోలో వస్తున్న ఈ చిత్రంలో చిరు కూతురిగా మలయాళ యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ నటిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ తమిళనాడులోని పొల్లాచ్చి పరిసర ప్రాంతాలలో శరవేగంగా జరుగుతోంది





# త్రిషకు సీక్రెట్‌గా పెళ్లయిందా?..

## నెట్టింట వైరల్‌గా మారిన 'మంగళసూత్రం' ఫొటో!

సౌత్ స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ పెళ్లిపై సోషల్ మీడియాలో మరోసారి ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఆమె మెడలోని ఒక లాకెట్ ఇప్పుడు నెట్టింట తీవ్ర దుమారం రేపుతోంది. ఒక ఫొటోలో త్రిష ధరించిన పెండెంట్‌ను నిశితంగా గమనించిన నెటిజన్లు, అది వంద శాతం కేరళ క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో ఉండే 'మిన్ను' (మంగళసూత్రం) అని వాదిస్తున్నారు. దీంతో ఇంటర్నెట్‌లో ఒక్కసారిగా ఊహాగానాలు ఊపందుకున్నాయి. అసలు త్రిషకు సీక్రెట్‌గా పెళ్లయిపోయిందా? పెళ్లికూతురు ఇక్కడే ఉంది కానీ పెళ్లికొడుకు ఎక్కడ? అంటూ అభిమానులు, నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అయితే, ఇది కేవలం ఏదైనా సినిమా షూటింగ్‌కు సంబంధించిన లుక్ అయ్యిండవచ్చని, లేదా సాధారణ జ్యువెలరీ డిజైన్ అయ్యిండవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో కూడా త్రిష పెళ్లిపై అనేక రూమర్స్ రాగా, ఆమె వాటిని కొట్టిపారేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి ఈ వైరల్ పిక్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అయితే దీనిపై త్రిష టీమ్ ఇప్పటివరకు స్పందించలేదు.

# షూటింగ్‌లో కో-స్టార్ వేధింపులు..

## 'నాకు ముద్దు పెడుతూనే ఉన్నాడంటూ' బాలీవుడ్ నటి ఆవేదన



బాలీవుడ్, మరాఠీ చిత్ర పరిశ్రమలలో గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియా బాపట్ తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా షూటింగ్ సమయంలో ఒక పాట చిత్రీకరణలో సహ నటుడు తనకు నచ్చకపోయినా పదే పదే ముద్దు పెట్టుకున్నాడని, ఆ సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆమె వెల్లడించారు. కథా చర్చల సమయం నుంచే తాను ఆ ముద్దు సీన్ అవసరమా అని దర్శకుడిని ప్రశ్నించానని, అయితే షూటింగ్ స్పాట్‌లో మాత్రం సదరు నటుడు స్క్రిప్ట్‌లో లేని విధంగా, ఇంప్రూవైజేషన్ పేరుతో హద్దులు దాటి ప్రవర్తించాడని ప్రియా బాపట్ పేర్కొన్నారు. ఆ సమయంలో ఏం చేయాలో తోచక, తన గొంతు ఎలా వినిపించాలో తెలియక ఎంతో నిస్సహాయంగా ఉండిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందికరమైన వాతావరణం కేవలం షూటింగ్‌తోనే ముగిసిపోలేదని, తామిద్దరూ ఒకే హోటల్‌లో బస చేసినప్పుడు, తాను ఎన్నిసార్లు నిరాకరించినా ఆ నటుడు బ్రేక్‌ఫాస్ట్ లేదా డిన్నర్‌కు రమ్మంటూ పదే పదే వేధించాడని ప్రియ తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన తాను ప్రతిరోజూ రాత్రి తన భర్త ఉమేష్ కామత్‌కు ఫోన్ చేసి ఏడ్చేదాన్నని, దాంతో ఆందోళన చెందిన ఆయన వెంటనే ముంబై నుండి భోపాల్ షూటింగ్ స్పాట్‌కు వచ్చి మూడు రోజుల పాటు తనతోనే ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 'మున్నాభాయ్ ఎంబీబీఎస్' చిత్రంతో పాటు 'సిటీ ఆఫ్ డ్రీమ్స్' వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియా బాపట్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి

# 'బిగ్‌బాస్' ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. 10వ సీజన్ వచ్చేస్తోంది




'బిగ్‌బాస్' అభిమానులకు గుడ్ న్యూస్. బిగ్‌బాస్ 10వ సీజన్ రాబోతుంది. ఇప్పటికే 9 సీజన్లను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న ఈ బిగ్ రియాల్టీ షో.. త్వరలోనే 10వ సీజన్‌తో ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతోంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఓ స్పెషల్ వీడియోని విడుదల చేశారు నిర్వాహకులు. 10వ సీజన్‌కు కూడా కింగ్ నాగార్జుననే హోస్ట్‌గా వ్యవహరించబోతున్నాడు. 'బిగ్‌బాస్.. ఎన్నో యుద్ధాలు గెలుచుకున్న రాజ్యం మాత్రమే కాదు, ఎంతోమంది హృదయాలు గెలుచుకున్న మహా సామ్రాజ్యం'అంటూ నాగార్జున చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్‌తో స్పెషల్ వీడియో ప్రారంభం అవుతుంది. బిగ్‌బాస్‌పై రూపొందించిన ఓ ప్రత్యేక పాటతో వీడియో ఆద్యంతం అలరించేలా సాగుతుంది. చెదరని ప్రస్థానం..తరగని అభిమానం బిగ్‌బాస్ సొంతం. ఈ ప్రస్థానం ఇంకో కొత్త చాప్టర్‌కి సాక్ష్యం కాబోతుంది. ఈ సారి మీరు చూడబోయేది బిగ్‌బాస్ దశావతారం' అంటూ సీజన్ 10పై ఆసక్తిని పెంచేశాడు నాగార్జున. ఇక ప్రతి సీజన్ ఏదో ఒక క్యాప్షన్‌తో వచ్చే బిగ్‌బాస్.. ఈ సారి కూడా 'ఆటలో సవాలు కాదు.. ఆటే సవాలు' అనే క్యాప్షన్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే షో ఎప్పుడు ప్రారంభం అవుతుంది? కంటెస్టెంట్స్ ఎవరనే విషయాలను మాత్రం ప్రకటించలేదు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613